# మహా న్యూస్

www.mahinewsindia.com

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 02 సంచిక : 184 ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య పేజీలు : 8 వెల రూ. 2 సోమవారం -05 - అక్టోంబర్ - 2026

Published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana



విలేకరులు కావలెను

మహా న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహా న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

-: సంప్రదించండి :-

9059585898


## ప్రధాని మోదీకి చక్కటి ఆలోచనలున్నాయి

- ఉక్రెయిన్ సంఘర్షణను ముగించే అంశాన్ని ప్రస్తావిస్తూ ఉంటారు
- రష్యా--ఉక్రెయిన్ సంఘర్షణను పరిష్కరించడంపై భారత ప్రధాని నరేంద్ర మోదీకి చాలా చక్కటి ఆలోచనలు ఉన్నాయని రష్యా అధ్యక్షుడు పుతిన్ చెప్పారు.



మాస్కో: రష్యా--ఉక్రెయిన్ సంఘర్షణను పరిష్కరించడంపై భారత ప్రధాని నరేంద్ర మోదీకి చాలా చక్కటి ఆలోచనలు ఉన్నాయని రష్యా అధ్యక్షుడు పుతిన్ చెప్పారు. మిగతా 2లో

## శ్రీసిటీ బాయిలర్ పేలుడు ఘటనపై పీవీఎన్ మాధవ్ దిగ్భ్రాంతి



- నలుగురి మృతి అత్యంత విషాదకరం.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై తక్షణమే ప్రత్యేక తనిఖీలు చేపట్టాలి
- తిరుపతి జిల్లా శ్రీసిటీలోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో వాటర్ బాయిలర్ పేలి నలుగురు మృతి చెందిన ఘటనపై భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పీవీఎన్ మాధవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

అమరావతి: తిరుపతి జిల్లా శ్రీసిటీలోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో వాటర్ బాయిలర్ పేలి నలుగురు మిగతా 2లో

## భారత మహిళా హాకీ జట్టుకు వైఎస్ జగన్ అభినందనలు



- శ్రీసిటీలో జరిగిన ప్రమాదంపై వైయస్ జగన్ దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి
- తిరుపతి జిల్లా శ్రీసిటీ లోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటనలో నలుగురు మృతి చెందడంపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ వైయస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

తిరుపతి జిల్లా శ్రీసిటీ లోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటనలో నలుగురు మృతి చెందడంపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మిగతా 2లో

## ఏపీ అభివృద్ధిలో టెక్నాలజీ వినియోగంపై సీఎం స్పెషల్ ఫోకస్

- ఆ ప్రాజెక్టును ఏపీలో ఏర్పాటు చేసేలా చూడాలి..
- శ్రీసిటీలో ప్రమాదంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి
- పాన్ ఐఐటీ సమ్మిట్ జరుగుతున్న ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించిన ముఖ్యమంత్రి
- అక్సి ఏరోస్పేస్ సంస్థ రూపొందించిన డ్రోన్ ను పరిశీలించిన ముఖ్యమంత్రి
- ఏపీ అభివృద్ధిలో టెక్నాలజీ వినియోగంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పెషల్ ఫోకస్ పెట్టారు.
- జయవాడ అంబేద్కర్ కళావేదికలో ఈరోజు (శనివారం) జరిగిన పాన్ ఐఐటీ సమ్మిట్‌లో టెక్నాలజీ ఆవిష్కరణలను సీఎం ప్రోత్సహించారు
- పాన్ ఐఐటీ సమ్మిట్ జరుగుతున్న ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను సందర్శించారు. అక్సి ఏరోస్పేస్ సంస్థ రూపొందించిన డ్రోన్‌ను పరిశీలించారు.
- ఆ సంస్థ ప్రతినిధుల కోరిక మేరకు డ్రోన్‌పై సంతకం చేశారు. అలాగే, వివిధ స్టార్టప్‌లు, ఐఐటీయన్ల నూతన ఆవిష్కరణలను ముఖ్యమంత్రి పరిశీలించారు
- పెట్రోలుతో నడిచే టూవీలర్లను గంటల్లో ఈవీలుగా కన్వర్ట్ చేసే సంస్థ ఏర్పాటు చేసిన స్టాల్‌ను సీఎం చంద్రబాబు సందర్శించారు

### అంబేద్కర్ కళావేదికలో పాన్ ఐఐటీ సమ్మిట్లో పాల్గొన్న సీఎం చంద్రబాబు




ఏపీ అభివృద్ధిలో టెక్నాలజీ వినియోగంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పెషల్ ఫోకస్ పెట్టారు. విజయవాడ అంబేద్కర్ కళావేదికలో ఈరోజు (శనివారం) జరిగిన పాన్ ఐఐటీ సమ్మిట్‌లో టెక్నాలజీ ఆవిష్కరణలను సీఎం ప్రోత్సహించారు. మిగతా 2లో

## దేశవ్యాప్త నిరసనలకు డిజిటల్ వేదిక.. రాహుల్ గాంధీ 'సత్యాగ్రహ'

- దేశంలో వివిధ సమస్యలపై ఒంటరిగా పోరాడుతున్న ప్రజల గొంతుకలను ఒకే తాటిపైకి తీసుకువచ్చేందుకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇవాళ (శనివారం) 'సత్యాగ్రహ' అనే నూతన డిజిటల్ వేదికను ప్రారంభించారు.
- దేశంలోని విభిన్న ప్రాంతాల్లో జరుగుతున్న సమస్యల నిరసనలను, ఉద్యమాలను ఒక ఇంటరాక్టివ్ మ్యాప్ ద్వారా ఒకే చోట అనుసంధానించడమే ఈ వెబ్‌సైట్ ప్రధాన ఉద్దేశం.



దేశంలో వివిధ సమస్యలపై ఒంటరిగా పోరాడుతున్న ప్రజల గొంతుకలను ఒకే తాటిపైకి తీసుకువచ్చేందుకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ (శనివారం) 'సత్యాగ్రహ' అనే నూతన డిజిటల్ వేదికను ప్రారంభించారు. మహాత్మా గాంధీ 157వ జయంతి మిగతా 2లో

## పిల్లల ఆన్‌లైన్ భద్రతకు ప్రత్యేక ఫ్రేమ్‌వర్క్

### విద్యా, వైద్యంపై జిల్లాల వారీగా ప్రతి వారం సమీక్షించాలి

- ఆన్‌లైన్‌లో పిల్లల సేఫ్టీ.. అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు
- మహిళలు, పిల్లల రక్షణే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని వెల్లడి
- సైబర్ క్రైమ్‌కు 1930, చైల్డ్ హెల్ప్‌లైన్‌కు 1098 నంబర్లు గుర్తుంచుకోవాలని సూచన
- డిజిటల్ యుగంలో సైబర్ నేరాల నుంచి పిల్లలకు రక్షణ కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది.
- పిల్లల ఆన్‌లైన్ భద్రత కోసం ఒక సమగ్ర ఫ్రేమ్‌వర్క్‌ను వెంటనే రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.
- హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) సౌత్ జోన్ రీజనల్ కాన్ఫరెన్స్‌లో ఆయన ఈ ఆదేశాలు జారీ చేశారు.
- ఆన్‌లైన్‌లో పిల్లలు ఎక్కువ సమయం గడుపుతున్నారని, అక్కడ ఎదురయ్యే ప్రమాదాలపై వారికి సరైన అవగాహన ఉండటం లేదని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు.
- ఈ నేపథ్యంలో, తెలంగాణ హైకోర్టు, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థతో సంప్రదింపులు జరిపి ఈ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించాలని సూచించారు.



ఒక సమగ్ర ఫ్రేమ్‌వర్క్‌ను వెంటనే రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) సౌత్ జోన్ రీజనల్ కాన్ఫరెన్స్‌లో ఆయన ఈ ఆదేశాలు జారీ చేశారు. ఆన్‌లైన్‌లో పిల్లలు ఎక్కువ సమయం గడుపుతున్నారని,

డిజిటల్ యుగంలో సైబర్ నేరాల నుంచి పిల్లలకు రక్షణ కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. పిల్లల ఆన్‌లైన్ భద్రత కోసం అక్కడ ఎదురయ్యే ప్రమాదాలపై వారికి సరైన అవగాహన ఉండటం లేదని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, మిగతా 2లో

## స్థానిక ఎన్నికలపై జనసేన స్పీడప్.. త్వరలో కొత్త కమిటీల ప్రకటన

### శ్రీసిటీ బాయిలర్ పేలుడు.. సేఫ్టీ ఆడిట్‌కు పవన్ కల్యాణ్ ఆదేశాలు

- పార్టీ బలం తెలుసుకున్నాకే అడుగులు
- సంస్థాగత నిర్మాణంపై నిర్ణయం
- జనసేన చీఫ్, డిప్యూటీ పవన్ కల్యాణ్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ కమిటీ ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.



జనసేన చీఫ్, డిప్యూటీ పవన్ కల్యాణ్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ కమిటీ ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ కీలక భేటీలో రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలసన్నాహాలు, మిగతా 2లో

## చంద్రబాబుకు ఇప్పుడు యంగ్ హార్డ్ వేర్ టీమ్ అండగా ఉంది



- విజయవాడలో 'పాన్ ఐఐటీ సమ్మిట్ - 2026
- హాజరైన మంత్రి నారా లోకేశ్
- ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మార్చడమే లక్ష్యమని ఉద్ఘాటన
- చంద్రబాబు అనుభవానికి యువ ఎమ్మెల్యేల బృందం తోడైందని వెల్లడి

ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవం అనే బలమైన సాఫ్ట్‌వేర్‌కు, యువతతో నిండిన చురుకైన హార్డ్‌వేర్ టీమ్ ఇప్పుడు అండగా నిలిచిందని, ఈ అరుదైన కలయికతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విజయవాడలో జరిగిన 'పాన్ ఐఐటీ సమ్మిట్ - 2026'లో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ 'వికసిత్ భారత్' లక్ష్యానికి తమ వంతు సహకారం అందిస్తామని, మిగతా 2లో

## కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య 'అవినీతి' ఒప్పందం



- రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీల మధ్య పరస్పర అవినీతి బాగోతాలను కప్పిపుచ్చుకునే 'క్విడ్ ప్రో కో' ఒప్పందం ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు ఆరోపించారు.
- ప్రధాని నరేంద్ర మోదీ దేశానికి సుపరిపాలన అందిస్తుంటే, తెలంగాణలో మాత్రం ఎవరు ఎక్కువ అవినీతి చేయాలనే అంశంపై కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు పోటీ పడుతున్నాయని విమర్శించారు.

రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీల మధ్య పరస్పర అవినీతి బాగోతాలను కప్పిపుచ్చుకునే 'క్విడ్ ప్రో కో' ఒప్పందం ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశానికి మిగతా 2లో

## స్థానికానికి లీగల్ సెల్ పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలి

### అనుభవజ్ఞులైన న్యాయవాదుల సేవలను వినియోగించుకోవాలి

- రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు నామినేషన్ నుంచి పోలింగ్, కౌంటింగ్ వరకు అన్ని దశల్లో న్యాయపరమైన అండ అందించేందుకు పార్టీ లీగల్ సెల్ పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి సూచించారు.
- గత రెండున్నరేళ్లుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా ప్రతినిధులకు లీగల్ సెల్ గట్టిగా అండగా నిలిచిందని అభినందించారు.




రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు నామినేషన్ నుంచి పోలింగ్, కౌంటింగ్ వరకు అన్ని దశల్లో న్యాయపరమైన అండ అందించేందుకు పార్టీ లీగల్ సెల్ పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి సూచించారు. మిగతా 2లో

## రోడ్ల మరమ్మతులు కూడా చేయించలేని స్థితిలో ప్రభుత్వం ఉంది



రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసింది: హరీశ్ రావు

నర్సాపూర్‌లో బీఆర్ఎస్‌లో చేరిన పలువురు కాంగ్రెస్ నేతలు

ఫ్యూచర్ సిటీ ఫ్యూచర్ లేని సిటీ అని ఎద్దేవా

రేవంత్ రెడ్డి మాట నిలబెట్టుకుండు : హరీష్ రావు ఆసక్తికర ట్వీట్

మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో పలువురు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నేతలకు మాజీ మంత్రి హరీశ్ రావు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ శకం మిగతా 2లో

మహి న్యూస్
MAHI NEWS
www.mahinewsindia.com
Epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక



## ప్రధాని మోదీకి చక్కటి ఆలోచనలున్నాయి

ప్రతి సమావేశంలోనూ మోదీ ఈ విషయాన్ని ప్రస్తావిస్తుంటారని తెలిపారు. గురువారం జరిగిన వాల్డాయ్ ఇంటర్నేషనల్ డిస్కషన్ క్లబ్ వార్షిక సమావేశంలో పుతిన్ మాట్లాడారు. "యుద్ధాలను ముగించడంపై ప్రధానమంత్రి మోదీ వైఖరి విషయానికి వస్తే.. మా ఇద్దరి మధ్య చాలా మంచి స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయి. ఉక్రెయిన్ సంఘర్షణను ముగించే అంశాన్ని ఆయన నిరంతరం ప్రస్తావిస్తూ ఉంటారు. రష్యా--ఉక్రెయిన్ ఘర్షణ గురించి ప్రశ్నలు అడిగే ప్రపంచ నాయకుల్లో మోదీ ఒకరని నేను చెప్పగలను. మేము జరిపే ప్రతి సమావేశంలోనూ మోదీ ఈ అంశాలను ప్రస్తావిస్తారు. ప్రత్యేక ఆసక్తిని కనబరుస్తారు. పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారాలను కనుగొనే లక్ష్యంతో మోదీ వద్ద చాలా మంచి ఆలోచనలు ఉన్నాయి"అని పుతిన్ స్పష్టంచేశారు. అలాగే బుధవారం ఓ సదస్సులో పుతిన్ ప్రసంగించారు. భారతదేశ సాంస్కృతిక వైవిధ్యం, ఐక్యత పట్ల ప్రశంసల వర్షం కురిపించారు. భారతదేశం తన విస్తృతి, వైవిధ్యంతో అందరినీ ఆశ్చర్యపరుస్తోందని అన్నారు. "ఈ విషయం చాలా తక్కువ మందికి తెలుసు. 150 కోట్ల మంది జనాభాలో 60 కోట్ల మంది భారతీయులు తమ మాతృభాష అయిన హిందీని మాట్లాడతారు. మిగిలిన వారు తమ మాతృ భాషలను మాట్లాడతారు. అయినప్పటికీ వారందరూ కలిసిమెలిసి జీవిస్తున్నారని మోదీ నాకు చెప్పారు. ఇది నిజంగా అద్భుతం, ప్రశంసనీయం. వైవిధ్యం, ఐక్యత ఎలా కలిసి ఉండగలవో చెప్పడానికి భారతీయ సంస్కృతిలో ఒక ప్రత్యేకత ఉంది. అది కచ్చితంగా ఒక ఉదాహరణగా నిలుస్తుంది. నిజంగానే మనం నేర్చుకోవాల్సిన విషయం"అని కొనియాడారు.

## దేశవ్యాప్త నిరసనలకు డిజిటల్ వేదిక.. రాహుల్ గాంధీ ‘సత్యాగ్రహ’

ముగిసిన మరుసటి రోజే, ఆయన అహింసాత్మక పోరాట సిద్ధాంతం స్ఫూర్తితో రూపొందించిన ఈ ప్లాట్‌ఫారమ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.

డిజిటల్ ప్లాట్‌ఫారమ్ ప్రధాన లక్ష్యం

దేశంలోని విభిన్న ప్రాంతాల్లో జరుగుతున్న సమస్యల నిరసనలను, ఉద్యమాలను ఒక ఇంటరాక్టివ్ మ్యాప్ ద్వారా ఒకే చోట అనుసంధానించడమే ఈ వెబ్‌సైట్ ప్రధాన ఉద్దేశం. ఒకే తరహా సమస్యలపై వేర్వేరు ప్రదేశాల్లో పోరాడుతున్న వ్యక్తులు, సంఘాలు ఒకరినొకరు గుర్తించి మద్దతు తెలుపుకోవడానికి ఇది సహాయపడుతుంది.'దేశంలో సత్యం, న్యాయం అణచివేతకు గురవుతున్న ప్రతి చోటా ప్రజలకు అండగా నిలవడం ప్రతిపక్ష నాయకుడిగా నా బాధ్యత' అని రాహుల్ గాంధీ తన వీడియో సందేశంలో పేర్కొన్నారు. వీధిపోరాటాల నుంచి పార్లమెంట్ వరకు, అలాగే లేఖల ద్వారా బాధితులకు మద్దతుగా నిలుస్తానని ఆయన హామీ ఇచ్చారు.

## చంద్రబాబుకు ఇప్పుడు యంగ్ హార్డ్ వేర్ టీమ్ అండగా ఉంది

అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఏపీని మార్చడమే తమ ఉమ్మడి లక్ష్యమని అన్నారు."ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రస్తుతం 4.0 ఆపరేటింగ్ సిస్టమ్‌తో మరింత ఉత్సాహంగా పనిచేస్తున్నారు. ఆయనకు ఇప్పుడు ఒక యంగ్ హార్డ్‌వేర్ టీమ్ అండగా ఉంది. మా శాసనసభ్యుల్లో 50 శాతం మంది మొదటిసారి గెలిచినవారే. 25 మంది మంత్రులలో 17 మంది తొలిసారి మంత్రులయ్యారు. అనుభవజ్ఞమైన సాఫ్ట్‌వేర్‌కు, ఈ యువ, డైనమిక్ హార్డ్‌వేర్ కలయికే నేటి ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలబెడుతోంది. ఏ రంగంలోనైనా ఆంధ్రప్రదేశ్ నంబర్ వన్‌గా ఉండాలన్నదే మా స్పష్టమైన విజన్" అని లోకేశ్ వివరించారు. 5 లక్షల మందికి పైగా ఐఐటీ గ్రాడ్యుయేట్లను కలిపే పాన్ ఐఐటీ సదస్సు ఏపీలో జరగడం ఆనందంగా ఉందన్నారు.అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి భారత్‌కు ఒక దశాబ్దం చాలని, ఆ స్వర్ణ దశాబ్దం మనదే కావాలని ఆకాంక్షించిన లోకేశ్, దీనికి తమ ప్రభుత్వం '3ఎ' మంత్రాన్ని అనుసరిస్తోందని తెలిపారు. "మొదటిది స్పీడ్ (వేగం), రెండోది సర్వీస్ (సేవ), మూడోది స్టెబిలిటీ (స్థిరత్వం). ప్రజలు మాకు ఇచ్చింది ఐదేళ్ల సమయం. ఈ సమయంలోనే ఫలితాలు చూపించాలి. కేవలం ఎంఓయూలు కుదుర్చుకుని వాటిని మర్చిపోయే రకం మాది కాదు. ప్రాజెక్టులకు వాస్తవ రూపమిచ్చి ఉద్యోగాలు సృష్టించాలన్న తపన మాది. పరిశ్రమదారులను మేము 'జాతి నిర్మాణకర్తలు'గా భావిస్తున్నాం. వారితో కలిసి పనిచేస్తూ, ప్రపంచ స్థాయి పాలన అందించడమే మా సేవా దృక్పథం. ఇక మూడోది స్థిరత్వం. మా పాలసీలు కాలపరీక్షను, రాజకీయ మార్పులను తట్టుకుని నిలబడేలా ఉంటాయి" అని ఆయన అన్నారు. ఇందుకు ఉదాహరణగా, గత కేసులన్నింటినీ ఏఐ ద్వారా విశ్లేషించి, న్యాయపరమైన చిక్కులు రాకుండా 16,000 ఉపాధ్యాయుల నియామక ప్రక్రియను చేపట్టామని గుర్తుచేశారు.కేవలం కాగితాలపై హామీలు కాకుండా, వాస్తవంగా అమలవుతున్న ప్రాజెక్టుల గురించి లోకేశ్ సవివరంగా మాట్లాడారు. "ఏపీలో నమో అంటే నాయుడు జీ, మోదీజీ జోడీ. డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ ప్రభుత్వం ఉండటం వల్లే పనులు వేగంగా జరుగుతున్నాయి.

## కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ‘అవినీతి’ ఒప్పందం

సుపరిపాలన అందిస్తుంటే, తెలంగాణలో మాత్రం ఎవరు ఎక్కువ అవినీతి చేయాలనే అంశంపై కాంగ్రెస్, బీఆర్ఎసలు పోటీ పడుతున్నాయని విమర్శించారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో బీఆర్ఎస్ నేతల అవినీతి చిట్టా విప్పి అరెస్టులు చేస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ పార్టీ.. నేటికీ ఒక్క కేసులోనూ అరెస్టు చేయలేదని మండిపడ్డారు. గత ప్రభుత్వం తెచ్చిన వివాదాస్పద జీవో 317ను బీజేపీతో పాటు ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతిరేకించారని, దానికి ప్రత్యామ్నాయంగా తెచ్చిన జీవో 190ని సైతం సరిగ్గా అమలు చేయడం లేదని విమర్శించారు. జీవో 190 పరిధిలో దాదాపు 4,000 మందికి బదిలీలు/డిప్యుటేషన్లు రావాల్సి ఉండగా, 100 నుంచి 200 మందికి మాత్రమే ఇచ్చారని ఆరోపించారు. దీనిపై గాంధీభవన్ ఎదుట ఆందోళన చేపట్టిన ఉపాధ్యాయులను అక్రమంగా అరెస్టు చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. అన్నదాతలను ఆదుకోవడానికి ప్రభుత్వం తక్షణమే 'రైతు భరోసా' నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశం సందర్భంగా బీజేపీ స్టేట్ సినిమా సెల్ కో-కన్వీనర్ వైభవ్ సూర్య ఆధ్వర్యంలో టీవీ నటులు స్వర్ణలత, లక్ష్మణ్, సీనియర్ కెమెరామెన్లు సురేష్, మహేష్ బీజేపీలో చేరారు.తెలంగాణలో అధికార కాంగ్రెస్, గతంలో పాలించిన బీఆర్ఎస్ మధ్య పరస్పర అవినీతి బాగోతాలను కప్పిపుచ్చుకునే 'క్విడ్ ప్రో కో' నడుస్తోందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు విమర్శించారు. మొన్న సిరిసిల్ల సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ప్రభుత్వ మంత్రులు, కుటుంబీకుల ఆస్తులపై ఆరోపణలు చేస్తే దానికి ప్రతిగా బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ అవినీతిపై ఆరోపణలు చేసుకుంటున్నారే తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని దుయ్యబట్టారు.

## శ్రీసిటీ బాయిలర్ పేలుడు ఘటనపై పీవీఎన్ మాధవ్ దిగ్భ్రాంతి

మృతి చెందిన ఘటనపై భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పీవీఎన్ మాధవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ ప్రమాదంలో నలుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆయన పేర్కొన్నారు. ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి అత్యుత్తమ వైద్యం అందించాలని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించాలని కోరారు.ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు జరిపి, నిర్లక్ష్యం లేదా భద్రతా ప్రమాణాల ఉల్లంఘనకు పాల్పడినట్లు తేలితే బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పీవీఎన్ మాధవ్ డిమాండ్ చేశారు. దర్యాప్తు నివేదికను పారదర్శకంగా వెల్లడించాలని కోరారు.అలాగే శ్రీసిటీతో పాటు రాష్ట్రంలోని అన్ని పారిశ్రామిక ప్రాంతాల్లో బాయిలర్లు, ఇతర ప్రమాదకర పరికరాల భద్రతా ప్రమాణాలపై తక్షణ ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుల భద్రత విషయంలో రాజీ పడకుండా, నిబంధనలు ఉల్లంఘించే పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రతి పరిశ్రమలో భద్రతా ఆడిట్ నిర్వహించి, లోపాలను వెంటనే సరిదిద్దేలా చర్యలు తీసుకోవాలని పీవీఎన్ మాధవ్ సూచించారు.మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా నిలవాలని కోరారువ్యవసాయ రంగా న్ని ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానం చేస్తూ.. యువతలో వ్యవసాయ నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా మదనపల్లెలో ఐఎస్ఏ ఏర్పాటవుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. జీహెచ్‌హెచ్, ఐఎ?సఏ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో దేశంలోనే తొలిసారిగా ఐఎస్‌బీని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. నేడు గాంధీ జయంతి రోజున రాయలసీమలో ఐఎస్ఏకి శ్రీకారం చుట్టారని తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ రాయలసీమను దేశ ఆర్థిక అభివృద్ధిలో కీలకమైన 'పవర్ హౌస్ ఆఫ్ ఇండియా'గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నారని ప్రశంసించారు. ఇటీవల ప్రధాని 'మన్ కీ బాత్'లో రాయలసీమకు చెందిన యువ రైతు వాసుదేవరెడ్డి గురించి ప్రస్తావించారని గుర్తుచేశారు.

## భారత మహిళా హాకీ జట్టుకు వైఎస్ జగన్ అభినందనలు

శ్రీ వైయస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు శ్రీ వైయస్ జగన్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబ సభ్యులు ఈ తీవ్ర విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలు అందించి, వారు త్వరగా కోలుకునేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు.అలాగే బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలిచి, తగిన సహాయం అందించాలని శ్రీ వైయస్ జగన్ కోరారు.భారత మహిళా హాకీ జట్టుకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ అభినందనలు తెలిపారు. ఆసియా క్రీడల్లో గోల్డ్ మెడల్ సాధించటంపై వైఎస్ జగన్ హర్షం వ్యక్తం చేశారు. స్వర్ణ పతకం సాధించడం దేశానికే గర్వకారణమని ప్రశంసలు కురిపించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఎక్స్ వేదికగా.. ఆసియా క్రీడల్లో గోల్డ్ మెడల్ సాధించిన భారత మహిళా హాకీ జట్టుకు అభినందనలు. డిఫెండింగ్ ఛాంపియన్ చైనాను 1--0తో ఓడించి.. 44 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ.. స్వర్ణ పతకం సాధించడం దేశానికే గర్వకారణం. ఆద్యంతం అద్భుతమైన పోరాట పటిమను ప్రదర్శించిన భారత జట్టు.. ముఖ్యంగా డిఫెన్స్‌లో అసాధారణ ప్రతిభ కనబరిచింది. కీలక సమయంలో కెప్టెన్ సవితా పునియా పెనాల్టీ స్ట్రోక్‌ను అడ్డుకోవడం మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. ఈ విజయంతో 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు భారత్ నేరుగా అర్హత సాధించడం మరింత ఆనందదాయకం. దేశం గర్వించేలా చేసిన భారత క్రీడాకారిణులందరికీ అభినందనలు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాను' అని పోస్టు చేశారు.

# పిల్లల ఆన్‌లైన్ భద్రతకు ప్రత్యేక ఫ్రేమ్‌వర్క్

తెలంగాణ హైకోర్టు, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థతో సంప్రదింపులు జరిపి ఈ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించాలని సూచించారు. మహిళలు, పిల్లల సంరక్షణే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ ఫ్రేమ్‌వర్క్ ద్వారా న్యాయ సేవలను రాష్ట్రంలోని ప్రతీ గ్రామానికి విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులకు సీఎం కీలక సూచనలు చేశారు. పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలను గమనించేటప్పుడు తీర్పులిచ్చేలా కాకుండా ఆసక్తిగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని అన్నారు. "క్యూరియస్‌గా ఉండండి, జడ్జ్‌మెంటల్‌గా కాదు" అని ఆయన హితవు పలికారు. సైబర్ క్రైమ్ ఫిర్యాదుల కోసం 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ కోసం 1098 నంబర్లను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఇప్పటికే భరోసా సెంటర్లు, దేశంలోనే మొదటి చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు, సైబర్‌హర్ యాప్ వంటివి సమర్థంగా పనిచేస్తున్నాయని సీఎం గుర్తుచేశారు.విద్యా, వైద్యంపై జిల్లాల వారీగా అధికారులు ప్రతి వారం సమీక్షించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో విద్యా, వైద్యంపై సీఎంవో అధికారులతో ఈరోజు (శనివారం) వీజఒ=ణలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. నిర్మాణంలోని ప్రధాన ఆస్పత్రులపై సీఎం ఆరా తీశారు. ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్, ఉస్మానియా ఆస్పత్రుల పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. ఆస్పత్రుల నిర్మాణం పూర్తయ్యే నాటికి సిబ్బంది నియామకాలు పూర్తి చేయాలని మార్గనిర్దేశం చేశారు.

ఆస్పత్రులనూ క్షేత్రస్థాయిలో పరిశీలించాలి..

వైద్యులు, ఇతర సిబ్బంది అవసరాలను ముందుగానే గుర్తించాలని సీఎం సూచించారు. అత్యాధునిక వైద్య పరికరాల కొనుగోలును వేగవంతం చేయాలని నిర్దేశించారు. ఆయా ఆస్పత్రులు పూర్తయ్యే నాటికి అన్ని వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లను అధికారులు తప్పనిసరిగా సందర్శించాలని ఆదేశించారు. జిల్లాల్లోని ఆస్పత్రులనూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు.

డిసెంబరులో భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్..

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అధికారులను సీఎం ఆదేశించారు. అవసరమైన చోట ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టాలని సూచించారు. తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 ఏర్పాట్లపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. డిసెంబరులో భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమ్మిట్ ఏర్పాట్లు, అతిథులు, పెట్టుబడులపై పకడ్బందీ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలో తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. ఈ మేరకు ఇవాళ సీఎంవో అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించిన ఆయన.. ఆస్పత్రుల నిర్మాణాలు, సిబ్బంది నియామకాలు, సీజనల్ వ్యాధుల కట్టడి, రాబోయే గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రుల పనులను సీఎం అడిగి తెలుసుకున్నారు. ఎల్బీనగర్, అల్వాల్ ప్రాంతాల్లో నిర్మిస్తున్న ఆస్పత్రుల పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా వరంగల్, ఉస్మానియా ఆస్పత్రుల నిర్మాణాలను కూడా నిర్ణీత గడువులోగా త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.కొత్తగా నిర్మిస్తున్న ఆస్పత్రులు పూర్తయ్యేలోపే అక్కడ అవసరమైన వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది నియామక ప్రక్రియను ముందస్తుగా ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. అంతేకాకుండా, ఆసుపత్రులకు అవసరమైన అత్యాధునిక వైద్య పరికరాల (వీవఒఅఝశ్రీ జునబఅజుఎవత్) కొనుగోలు ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని సూచించారు. ఇక జిల్లాల్లో కలెక్టర్లు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో విధిగా పర్యటించాలని తేల్చిచెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్, ఆసుపత్రులను స్వయంగా సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రస్తుత సీజన్‌లో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల వైద్య శాఖ పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని, తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

# ఏపీ అభివృద్ధిలో టెక్నాలజీ వినియోగంపై సీఎం స్పెషల్ ఫోకస్

పాన్ ఐఐటీ సమ్మిట్ జరుగుతున్న ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను సందర్శించారు.ఆక్సి ఏరోస్పేస్ సంస్థ రూపొందించిన డ్రోన్‌ను పరిశీలించారు. ఆ సంస్థ ప్రతినిధుల కోరిక మేరకు డ్రోన్‌పై సంతకం చేశారు. అలాగే, వివిధ స్టార్టప్‌లు, ఐఐటీయన్ల నూతన ఆవిష్కరణలను ముఖ్యమంత్రి పరిశీలించారు.పెట్రోలుతో నడిచే టూవీలర్లను గంటల్లో ఈవీలుగా కన్వర్ట్ చేసే సంస్థ ఏర్పాటు చేసిన స్టాల్‌ను సీఎం చంద్రబాబు సందర్శించారు. సాధారణ వాహనాలను ఈవీలుగా కన్వర్ట్ చేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాజెక్టును ఏపీలో ఏర్పాటు చేసేలా చూడాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించారు.ముఖాన్ని స్కాన్ చేసి హెల్త్ రిపోర్టు ఇచ్చే యాప్ తయారు చేసిన సంస్థ స్టాల్‌ను కూడా సందర్శించారు. నిమిషాల వ్యవధిలో ప్రాథమిక రిపోర్టు ఇవ్వగలమని సీఎంకు సదరు సంస్థ ప్రతినిధులు వివరించారు. స్వర్ణాంధ్ర-10 సూత్రాల అమల్లో టెక్నాలజీ వినియోగం ద్వారా సమర్థవంతంగా అమలు చేసే అంశంపై తమ ఐడియాలను ముఖ్యమంత్రికి వివరిస్తూ చిన్నారులు ప్రజెంటేషన్ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులను అభినందించారు. చిన్నారులతో కలిసి సీఎం చంద్రబాబు గ్రూప్ ఫొటో దిగారు.తిరుపతి జిల్లా శ్రీసిటీలోని ప్రైవేట్ పరిశ్రమలో వాటర్ బాయిలర్ పేలి నలుగురు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీసిటీలోని ఓ పరిశ్రమలో జరిగిన ఈ ప్రమాదంపై సీఎం అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాయిలర్ పేలిన సమయంలో ఘటనా స్థలంలోనే ఇద్దరు చనిపోయారని, మరో ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారని తెలిపారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తికి చికిత్స కొనసాగుతోందని వివరించారు. మృతుల కుటుంబాలకు సీఎం చంద్రబాబు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉండాలని అధికారులను ఆదేశించారు.సంస్థ ప్రతినిధుల కోరిక మేరకు డ్రోన్ పై సంతకం చేసిన సీఎం వివిధ స్టార్టప్ లు, ఐఐటీయన్ల నూతన ఆవిష్కరణలను పరిశీలించిన ముఖ్యమంత్రి.పెట్రోలుతో నడిచే టూవీలర్లను గంటల్లో ఈవీలుగా కన్వర్ట్ చేసే సంస్థ ఏర్పాటు చేసిన స్టాల్ సందర్శించిన సీఎం చంద్రబాబు.సాధారణ వాహనాలను ఈవీలుగా కన్వర్ట్ చేసే విధానాన్ని అడిగి తెలుసుకున్న సీఎం చంద్రబాబు.ఈ ప్రాజెక్టును ఏపీలో ఏర్పాటు చేసేలా చూడాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం.ముఖాన్ని స్కాన్ చేసి హెల్త్ రిపోర్టు ఇచ్చే యాప్ తయారు చేసిన సంస్థ స్టాల్ సందర్శించిన సీఎం చంద్రబాబు.నిమిషాల వ్యవధిలో ప్రాథమిక రిపోర్టు ఇవ్వగలమని సీఎం వివరించిన సదరు సంస్థ ప్రతినిధులు.స్వర్ణాంధ్ర-10 సూత్రాల అమలులో టెక్నాలజీ వినియోగం ద్వారా సమర్థవంతంగా అమలు చేసే అంశంపై తమ ఐడియాలను సీఎంకు వివరిస్తూ ప్రజెంట్ చేసిన చిన్నారులు. చిన్నారులను అభినందించిన ముఖ్యమంత్రి.. చిన్నారులతో కలిసి గ్రూప్ ఫొటో దిగిన సీఎం చంద్రబాబు.స్వచ్ఛాంధ్ర సాధన ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజల భాగస్వామ్యంతోనే అది ఉద్యమంగా మారుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా విజయవాడలో జరిగిన స్వచ్ఛ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. వ్యక్తిగత పరిశుభ్రత నుంచి ఇల్లు, పాఠశాల, కార్యాలయం, గ్రామం, పట్టణం వరకు ప్రతి స్థాయిలో మార్పు రావాలని ఈ సందర్భంగా సీఎం కోరారు. ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛతా కార్యక్రమాలకు కేటాయించాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛ మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, పాఠశాలలు, అంగన్‌వాడీలు, ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్‌స్టేషన్లు, రైతు బజార్లు, పరిశ్రమలు, స్వచ్ఛతపై పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, పారిశుధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లను స్వచ్ఛ అవార్డులతో సత్కరిస్తున్నామని చెప్పారు. ప్రతి ఇంటికి, పాఠశాలకు, గ్రామ పంచాయతీకి, మున్సిపాలిటీకి స్వచ్ఛత ఆధారంగా ర్యాంకులు ఇవ్వాలని సీఎం సూచించారు. చెత్తను సమస్యగా కాకుండా సంపదగా మార్చే విధానాన్ని అవలంభించాలన్నారు.రాష్ట్రంలో ఇంకా సుమారు 8లక్షల టన్నుల చెత్త తొలగించాల్సి ఉందని సీఎం తెలిపారు. జీరో గార్బేజ్ లక్ష్యాన్ని చేరుకునే వరకు అధికారులను వెంటాడతానన్నారు. రూఫ్‌టాప్ సోలార్‌ను విస్తృతంగా ప్రోత్సహించాలని సూచించారు. స్వచ్ఛ చల్లపల్లిని స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రంలో స్వచ్ఛతా కార్యక్రమాలు అమలు చేద్దామన్నారు. ఏటా అక్టోబరు 2 తేదీన నెట్‌జీరో, స్వచ్ఛతపై పనిచేసినవ్యక్తులు, సంస్థలకు అవార్డులు ఇచ్చే కార్యక్రమాలను చేపట్టాలన్నారు. అనంతరం స్వచ్ఛతా వారియర్లు, ఎన్జీవో సంస్థలకు స్వచ్ఛాంధ్ర-2026 అవార్డులను ముఖ్యమంత్రి ప్రదానం చేశారు.స్వచ్ఛ కాలనీలు, అసోసియేషన్లు, సంస్థలకు ఈ అవార్డులు దక్కాయి. నెట్‌జీరో అంశంపై ఐఐటీ కాన్పూర్-స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మధ్య సీఎం సమక్షంలో ఎంఓయూ కుదుర్చుకున్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ, ఐఐటీ కాన్పూర్ ప్రతినిధులు ఒప్పందంపై సంతకాలు చేశారు. రాష్ట్రంలో చెత్త సమస్య పరిష్కారానికి సీఎం శాశ్వత ప్రణాళిక రూపొందించారని మంత్రి నారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరాం, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లాల నుంచి స్వచ్ఛాంధ్ర అవార్డు గ్రహీతలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.వేతన సవరణ కమిషన్ కాలపరిమితిని ఆరు నెలలకు కుదించాలని బహుజన్ టీచర్స్ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూపతి రామారావు, చిట్టేటి రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 11వ పీఆర్సీ గడువు ముగిసి ఇప్పటికే మూడేళ్లు అయ్యిందన్నారు. అందువల్ల ఆరు నెలల్లో కమిషన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఆసియా క్రీడలు 2026లో భారత పురుషుల క్రికెట్ జట్టు స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 19 పరుగుల తేడాతో విజయం సాధించి, మరోసారి ఆసియా ఛాంపియన్‌గా నిలిచింది.

# స్థానికానికి లీగల్ సెల్ పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలి

వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులతో నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. గత రెండున్నరేళ్లుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా ప్రతినిధులకు లీగల్ సెల్ గట్టిగా అండగా నిలిచిందని అభినందించారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులకు అవసరమైన కుల ధ్రువీకరణ పత్రాలు, నో డ్యూస్ సర్టిఫికెట్లు, ఇతర పత్రాలను ముందుగానే సిద్ధం చేసుకునేలా సహకరించాలని సూచించారు. నామినేషన్ల దాఖలు, స్క్రూటినీ, పోలింగ్ సందర్భంగా ఎదురయ్యే సమస్యలపై వెంటనే స్పందించే వ్యవస్థ ఉండాలన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అన్నింటిలోనూ విఫలమై సజావుగా స్థానిక ఎన్నికలు జరిగితే వైఎస్సార్సీపీని ఎదుర్కోలేమన్న కారణంతో పోలీసులను, అధికారులను ఉపయోగించి అక్రమ కేసులు, వేధింపుల ద్వారా భయభ్రాంతులకు గురిచేసినా ధీటుగా ఎదుర్కొనేందుకు వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సన్నద్ధంగా ఉండాలని సూచించారు.ప్రతి జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకుని లీగల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి, జిల్లా పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ సమన్వయకర్తలతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అవసరమైన చోట న్యాయవాదులను అందుబాటులో ఉంచాలన్నారు. రాష్ట్ర స్థాయిలో కూడా సెంట్రల్ ఆఫీస్‌లో లీగల్ వార్‌రూమ్ తరహా వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు. లీగల్ సెల్ నాయకులు టీమ్ స్పిరిట్‌తో పనిచేయాలని, యువ న్యాయవాదులతో పాటు పార్టీ పట్ల సానుభూతి కలిగిన అనుభవజ్ఞులైన న్యాయవాదుల సేవలను కూడా వినియోగించుకోవాలని కోరారు.మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు అన్ని స్థానాల్లో పోటీ చేసేలా అవసరమైన న్యాయ సహకారం అందించాలని కోరారు. అభ్యర్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు, ఎన్ఓసీలు, పోలీస్ క్లియరెన్స్ తదితర పత్రాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా లీగల్ సెల్ ముందస్తుగా అప్రమత్తంగా ఉండాలన్నారు. నామినేషన్లను అడ్డుకునే ప్రయత్నాలు జరిగితే వెంటనే న్యాయపరంగా స్పందించాలని సూచించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు జిల్లా స్థాయి లీగల్ నాయకులు పూర్తి సమయం కేటాయించి పార్టీ అభ్యర్థులకు బ్యాక్‌బోన్‌గా నిలవాలని కోరారు. నియోజకవర్గ స్థాయి లీగల్ సెల్ అధ్యక్షులు పార్టీ ఇన్‌చార్జులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచించారు.వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ.. గత ఎన్నికలు, ఉప ఎన్నికల సమయంలో పార్టీ కార్యకర్తలకు లీగల్ సెల్ అందించిన సహకారాన్ని అభినందించారు. నామినేషన్లకు అవసరమైన అన్ని సర్టిఫికెట్లు ముందుగానే సిద్ధం చేయించడం, నామినేషన్లు సక్రమంగా దాఖలు చేయించడం, ఎన్నికల సమయంలో ఎదురయ్యే సమస్యలను రిటర్నింగ్ అధికారుల నుంచి రాష్ట్ర లీగల్ సెల్ వరకు వెంటనే తీసుకెళ్లేలా స్పష్టమైన కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న నియోజకవర్గాలు, ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని, ఎన్నికల ప్రక్రియ సాఫీగా జరిగేలా లీగల్ సెల్ ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని కోరారు.

# స్థానిక ఎన్నికలపై జనసేన స్పీడప్.. త్వరలో కొత్త కమిటీల ప్రకటన

వ్యూహాలపై ఆయన నాయకులతో సుదీర్ఘంగా చర్చించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పార్టీ బలాబలాలు, గతంలో సాధించిన ప్రాతినిధ్యం, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ఈ సమావేశంలో ప్రాథమిక సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయి పరిస్థితిని సమగ్రంగా అంచనా వేస్తూ, పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా పార్టీ సంస్థాగత నిర్మాణంపై పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్టీలోని ప్రస్తుతం పనిచేస్తున్న పాత కమిటీలన్నింటినీ తక్షణమే రద్దు చేస్తున్నట్లు ప్రకటిస్తూ, నూతన ఉత్తర్వులు జారీ చేశారు. క్షేత్రస్థాయిలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ, ప్రజల్లో మంచి గుర్తింపు ఉన్న నాయకులకు ప్రాధాన్యం ఇస్తూ త్వరలోనే కొత్త కమిటీలను పునర్వ్యవస్థీకరించి ప్రకటిస్తామని స్పష్టం చేశారు. పార్టీ యంత్రాంగానికి సరికొత్త పునాది వేసేందుకే ఈ సమూల ప్రక్షాళన చేపట్టినట్లు తెలుస్తోంది.స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి తుది వ్యూహం, పొత్తుల నిష్పత్తిపై ముందస్తు నిర్ణయాలు తీసుకోకుండా, ప్రతి నియోజకవర్గం, మండల స్థాయిలో పార్టీ కిందటి బలం ఎంత ఉందనేది సంపూర్ణంగా తెలుసుకున్నాకే అడుగులు వేయాలని నిర్ణయించారు. నియోజకవర్గాల వారీగా పూర్తి సమాచారం, ప్రజాభిప్రాయం, నాయకుల పనితీరు ఆధారంగా నివేదికలు సిద్ధం చేసిన తరువాతే అభ్యర్థుల ఎంపిక మరియు ఎన్నికల ప్రచారంపై స్పష్టమైన తుది నిర్ణయాన్ని వెల్లడిస్తామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.తిరుపతి జిల్లా శ్రీసిటీలో జరిగిన ప్రమాద ఘటనపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆరా తీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని దిశానిర్దేశం చేశారు. పరిశ్రమలో బాయిలర్ పేలి నలుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై పవన్ విచారం వ్యక్తం చేశారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఔషధాలు తయారు చేసే ఈ పరిశ్రమలో బాయిలర్ పేలడంతో విధుల్లో ఉన్న నలుగురు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందగా, మరికొందరు గాయపడినట్లు డిప్యూటీ సీఎంకు అధికారులు వివరించారు.గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం చెన్నై అపోలో ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదం జరిగిన పరిశ్రమలో ప్రస్తుత పరిస్థితిపై డిప్యూటీ సీఎం ఆరా తీశారు. గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే శ్రీ సిటీ పరిధిలోని అన్ని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల అమలుపై సమీక్ష నిర్వహించి, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ ఘటనపై తక్షణమే సమగ్ర సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు.ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు వెల్లంపల్లి శ్రీనివాస్, రాయన భాగ్యలక్ష్మి, దేవినేని అవినాష్, ఎంపీ మిథున్‌రెడ్డి, పూనూరి గౌతమ్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఎక్స్ వేదికగా..'అహింసా మార్గంలో దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన జాతిపిత మహాత్మా గాంధీ. 'జై జవాన్.. జై కిసాన్' నినాదంతో దేశానికి స్ఫూర్తినిచ్చిన మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి. వారిద్దరి పోరాటం, త్యాగం తరతరాలకు ఆదర్శనీయం. ఈ మహనీయుల జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్నాను' అని పోస్టు చేశారు.'జై జవాన్.. జై కిసాన్' నినాదంతో దేశానికి స్ఫూర్తినిచ్చిన మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి గార్ల పోరాటం, త్యాగం తరతరాలకు ఆదర్శనీయం.

# రోడ్ల మరమ్మతులు కూడా చేయించలేని స్థితిలో ప్రభుత్వం ఉంది

ముగిసిందని అన్నారు. సాధారణంగా ప్రతిపక్షం నుంచి అధికార పక్షంలోకి వలసలు ఉంటాయని, కానీ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉన్నప్పటికీ అధికార కాంగ్రెస్ నుంచి నేతలు ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌లోకి రావడం అసాధారణమని వ్యాఖ్యానించారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో కనీసం రోడ్ల మరమ్మతులు కూడా చేపట్టలేదని, రోడ్లు గుంతలమయంగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఆయన విమర్శించారు.అభివృద్ధి పనుల వైఫల్యం కారణంగా ప్రజలు కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్నారని, ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న పార్టీలో ఉండటం కంటే కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడమే మేలని భావించి కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని హరీశ్ రావు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చెబుతున్న 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టును ఆయన 'ఫ్యూచర్ లేని సిటీ'గా ఎద్దేవా చేశారు. ఇప్పటికే ఉన్న నివాస ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా, ఇలాంటి ప్రాజెక్టులు చేపట్టడం ఏంటని ఆయన మండిపడ్డారు.రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్ అభద్రత, సాగునీటి ఎద్దడిపై బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పాత రోజులు తెస్తామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి, నిజంగానే ఆనాటి అంధకారపు కరెంట్ కోతల రోజులను తిరిగితీసుకొచ్చారని ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఎద్దేవా చేశారు. 24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వడం దేవుడెరుగు, కనీసం 6 గంటలు కూడా సరఫరా చేయలేక ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసిందని విమర్శించారు.కరెంట్ కోతలకు 'ఎల్ నినో' ప్రభావమే కారణమని నెపం నెట్టి ప్రభుత్వం బాధ్యతల నుంచి తప్పించుకోవాలని చూస్తోందని, కానీ నీళ్లు, కరెంట్ లేక పంటలు ఎండిపోతుంటే రైతన్నల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. పంట పొలాలు ఎండిపోవడంతో కడుపు మండిన మెదక్ జిల్లా రామాయంపేట రైతులు సబ్‌స్టేషన్ ఎదుట ధర్నాకు దిగాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. "పరిపాలన అంటే మైకుల ముందు నిలబడి ఉపన్యాసాలు దంచడం కాదు.. సంక్షోభంలో ఉన్న అన్నదాతకు అండగా నిలవడం" అని సీఎం రేవంత్ రెడ్డికి హరీష్ రావు సూచించారు. సకాలంలో సాగునీరు, నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించి రైతుల బతుకులను నిలబెట్టడమే ప్రభుత్వ ప్రాథమిక కర్తవ్యమని, ఇప్పటికైనా మాటలు కట్టిపెట్టి వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. త్వరలోనే కొడంగల్‌లో బీఆర్ఎస్ సభను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఎక్కడైనా పర్యటించవచ్చని.. సిరిసిల్లలో బలప్రదర్శన చేయాల్సిన అవసరం లేదన్నారు. సిరిసిల్ల ఏమైనా పక్క రాష్ట్రంలో ఉందా అని ప్రశ్నించారు.

## పక్షపాతం చూపితే ప్రశ్నిస్తాం.. కాకాణి హెచ్చరిక



నెల్లూరు జిల్లా: మనుబోలులో 19 గ్రామపంచాయతీల వైఎస్సార్సీపీ నేతలు, కార్యకర్తలతో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కీలక సమావేశం నిర్వహించారు. కాకాణి పూజిత సమావేశానికి హాజరయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల కార్యాచరణపై పార్టీ శ్రేణులకు కాకాణి దిశానిర్దేశం చేశారు. స్థానిక సమస్యల పరిష్కారంపై నేతలు, కార్యకర్తల నుంచి సూచనలు, సలహాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలని పిలుపునిచ్చారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు చంద్రబాబు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని కాకాణి మండిపడ్డారు. స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా అడ్డుకోవద్దని.. బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నామినేషన్లను అడ్డుకునే ప్రయత్నాలు చేయొద్దని అధికారులను కాకాణి కోరారు. పోలీస్, రెవెన్యూ, ఎన్నికల అధికారులు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని డిమాండ్ చేసిన కాకాణి.. అధికారులు పక్షపాత వైఖరి ప్రదర్శిస్తే చట్టపరంగా ప్రశ్నిస్తామని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీకి చట్టబద్ధంగా రావాల్సిన హక్కులు, పారదర్శక సేవలు అందించాల్సిందేనని కాకాణి స్పష్టం చేశారు.

## టీడీపీ నేతల నుంచి నాకు ప్రాణహాని ఉంది: కేతిరెడ్డి



అనంతపురం: టీడీపీ నేతల నుంచి తనకు ప్రాణహాని ఉందని.. టీడీపీ ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, జేసీ ప్రభాకర్ రెడ్డి తనను చంపేందుకు కుట్రలు చేస్తున్నారంటూ వైఎస్సార్‌సీపీ తాడిపత్రి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌లకు తెలిసే ఇదంతా జరుగుతోందా?" అంటూ ఆయన ప్రశ్నించారు. జేసీ అరాచకాలపై అనంతపురం ఎస్పీ జగదీష్ ఎందుకు మౌనంగా ఉన్నారంటూ నిలదీసిన కేతిరెడ్డి.. తన ఇంటి వద్ద అనుమానాస్పదంగా సంచరించే వారిని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. "నా గన్‌మెన్‌ను ట్రాప్ చేసి ఎప్పటికప్పుడు సమాచారం తీసుకుంటున్నారు. నా కదలికలపై జేసీ ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. సాక్షాత్తూ పోలీసులే జేసీ ప్రభాకర్‌రెడ్డికి కోవర్ట్‌గా మారడం దురదృష్టకరం" అని కేతిరెడ్డి పేర్కొన్నారు. "పోలీసులు జేసీ తొత్తులుగా వ్యవహరించడం దుర్మార్గం. మాజీ ఎమ్మెల్యేకే రక్షణ కల్పించలేని పోలీసులు ఎందుకు?. థర్డ్ పార్టీ విచారణ జరిగితే అన్ని విషయాలు బయటకు వస్తాయి. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు చర్యలు తీసుకోవాలి" అని మాజీ కేతిరెడ్డి పెద్దారెడ్డి డిమాండ్ చేశారు.

## మద్యం ప్రియులకు అలెర్ట్.. తెలంగాణలో బార్లు బంద్!




హైదరాబాద్: ప్రివిలేజ్ ఫీజు పేరుతో ప్రభుత్వం తమపై విపరీతమైన ఆర్థిక భారం మోపుతోందని మండిపడుతూ తెలంగాణ రాష్ట్ర రెస్టారెంట్, బార్ ఓనర్స్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. రేపటి నుంచి తెలంగాణలో బార్లు బంద్ పాటించేందుకు పిలుపునిచ్చాయి. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు ఆందోళనలు ఉధృతం చేయాలని నిశ్చయించుకున్న బార్ల యజమానులు, సోమవారం (అక్టోబర్ 5) నుంచి రాష్ట్ర వ్యాప్తంగా బార్ అండ్ రెస్టారెంట్లను పూర్తిగా మూసి వేయనున్నట్లు ప్రకటించారు. ఈ బంద్ పిలుపుతో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న దాదాపు 1,200లకు పైగా బార్ అండ్ రెస్టారెంట్లు మూతపడనున్నాయి. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో బార్ స్లాబ్స్ ప్రకారం ప్రివిలేజ్ ఫీజును 8 శాతం నుంచి ఏకంగా 20 శాతానికి పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం బార్ యజమానుల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. ఇప్పటికే లైసెన్సు ఫీజుల రూపేణా ఏటా రూ.33 లక్షల నుంచి రూ.56 లక్షల వరకు చెల్లిస్తున్నామని, ఇప్పుడు కొత్తగా తెచ్చిన ప్రివిలేజ్ ఫీజు వల్ల ఒక్కో బార్‌పై అదనంగా మరో రూ.30 లక్షల వరకు భారం పడుతుందని యజమనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై స్పందించిన తెలంగాణ రాష్ట్ర రెస్టారెంట్, బార్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు నేరుగా ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి తమ గోడును వెళ్లగక్కారు. బార్ల నిర్వహణ నిబంధనలు, లైసెన్స్ ఫీజులు మరియు అడ్డగోలుగా పెంచిన ప్రివిలేజ్ ఫీజు జీవోను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం నుంచి స్పందన వచ్చే వరకు బంద్ కొనసాగుతుందని, డిమాండ్లు నెరవేరకపోతే నిరాహార దీక్షలతో పాటు భవిష్యత్తులో మరింత ఉధృతమైన ఆందోళన కార్యక్రమాలకు దిగుతామని అసోసియేషన్ స్పష్టం చేసింది.

## తల్లికి వందనం 2వ విడతపై బిగ్ అప్‌డేట్ - ఖాతాల్లో రూ.13,000 జమ ఎప్పుడంటే?




**అమరావతి,:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకం రెండో విడత నిధుల విడుదలకు రంగం పూర్తిగా సిద్ధమైంది. మొదటి విడతలో లబ్ధి పొందని అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ చేసేందుకు పాఠశాల విద్యాశాఖ పంపిన ప్రతిపాదనలకు రాష్ట్ర ఆర్థిక శాఖ ఇప్పటికే అధికారికంగా ఆమోద ముద్ర వేసింది. ఈ తాజా విడతలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3.29 లక్షల మంది విద్యార్థుల తల్లులకు లబ్ధి చేకూరనుండగా, సీఎంవో (ముఖ్యమంత్రి కార్యాలయం) నుంచి తుది క్లియరెన్స్ రాగానే రాబోయే ఒకటి లేదా రెండు వారాల్లో నేరుగా డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ద్వారా తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.13,000 చొప్పున జమ చేయనున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మొత్తం రూ.15,000 ఆర్థిక సాయంలో పాఠశాల మౌలిక వసతుల నిర్వహణ నిధి కోసం రూ.2,000 మినహాయించి మిగిలిన రూ.13,000 మొత్తాన్ని జమ చేయనున్నారు. ఈ రెండో విడత ద్వారా ముఖ్యంగా ఈ విద్యాసంవత్సరం ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందినవారు, అలాగే గతంలో బ్యాంక్ ఖాతా లింకేజ్, ఆధార్ సీడింగ్, ఈ-కేవైసీ వంటి సాంకేతిక సమస్యల కారణంగా మొదటి విడతలో లబ్ధి అందని వారికి పూర్తిస్థాయిలో నగదు అందనుంది. బ్యాంక్ ఖాతాలు యాక్టివ్‌గా ఉండి ఆధార్ ఎన్‌పీసీఐ లింక్ అయి ఉన్నాయో లేదో సరిచూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# మెరిట్‌కు అసలు కొలమానం..



'మెరిట్' అనే మాట వినగానే మనకు సాధారణంగా ఒక పరీక్ష గుర్తుకొస్తుంది. ఎక్కువ మార్కులు సాధించినవాడు మెరిట్‌లో ముందుంటాడు. తక్కువ మార్కులు వచ్చినవాడు వెనుకబడతాడు. ఈ లెక్కలో ఎవరి కులమూ, కుటుంబమూ, స్కూలూ, తల్లిదండ్రుల విద్యార్హతలూ, ఆర్థిక పరిస్థితులూ ఏవీ కనిపించవు; కాగితంపై మిగిలే మార్కులు తప్పించి. ఒకే పరీక్ష రాసిన ఇద్దరు విద్యార్థులకూ పరీక్షా సమయం, ప్రశ్నపత్రం ఒకటే ఉండొచ్చు. కానీ ఆ పరీక్షకు చేరుకునే దారి మాత్రం ఒకటేనా? ఒకరికి చిన్నప్పటి నుంచే పుస్త కాలతో నిండిన ఇల్లూ, చదువుకున్న తల్లిదండ్రులూ, ప్రైవేట్ స్కూలూ, ట్యూషనూ, ఇంటర్నెట్, పర్సనల్ రూమ్, కాంపిటీటివ్ కోచింగ్... ఇవన్నీ ఉంటే, మరొకరికి మొదటి తరంలోనే చదువు మొదలై ఉంటే; పరీక్ష హాలులోకి వచ్చినప్పుడు ఇద్దరి మధ్య ఉన్న తేడాని కేవలం 'మెరిట్' అన్న ఒక్క పదంతోనే వివరించగలమా? మెరిట్ అన్నది వ్యక్తి ప్రతిభకు మాత్రమే కొల మానమా, లేక వ్యక్తికి లభించిన అవకాశాల ఫలితమూ అందులో కలిసే ఉంటుందా? భారతదేశంలో విద్యా అవ కాశాలు గతంతో పోలిస్తే విస్తరించాయి. కానీ అందరికీ ఒకే స్థాయీ ప్రయాణం మొదలు కాలేదు. 2017--18 విద్యా సర్వే ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 15 ఏళ్లు పైబడిన వారిలో కేవలం 5.7 శాతం మంది మాత్రమే గ్రాడ్యు యేట్లు లేదా అంతకంటే పై స్థాయి విద్య పూర్తి చేశారు. పట్టణ ప్రాంతాల్లో ఈ శాతం 21.72. అదే సర్వే గ్రామీణ ప్రాంతాల్లో సెకండరీ పాఠశాల ఒక కిలోమీటర్ పరిధిలో ఉందని చెప్పిన కుటుంబాలు సుమారు 38 శాతం మాత్ర మేనని నమోదు చేసింది. పట్టణాల్లో అది దాదాపు 70 శాతం. ఇది కేవలం పేదరికం సమస్య కాదు. కులం కూడా విద్యా అవకాశాల పంపిణీలో భాగమే. భారత విద్యాశాఖకు చెందిన ఒక అధ్యయనం సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులు మొదటి తరం విద్యార్థులుగా ఉండే అవకాశం ఎక్కువగా ఉందనీ, వారికి విద్యా వ్యవస్థలో అవసరమైన సామాజిక--సాంస్కృతిక మూలధనం తక్కు వగా ఉండవచ్చునీ, ప్రవేశ దశలోనే విద్యా అసమానతలు ఉంటాయనీ గుర్తించింది. ఇక్కడ 'సామాజిక మూలధనం' అన్న మాట ముఖ్యమైనది. ఐఐటీలపై చేసిన ప్రసిద్ధ పరి శోధనలో సామాజికంగా లభించిన కుల మూలధనం ఆధు నిక విద్యా మెరిట్‌గా ఎలా మారుతుందనే ప్రశ్నను పరిశీలించారు. చదివి మంచి మార్కులు సాధించిన విద్యార్థి నిజంగానే ప్రతిభావంతుడై ఉండవచ్చు. ప్రశ్న వ్యక్తిగత ప్రతిభను నిరాకరించడం కాదు, ఆ ప్రతిభ పెరగడానికి లభించిన పరిస్థితులు సమానంగా ఉన్నాయా అని అడగడం.

సామాజిక మూలధనం

ఇదే తేడా అర్థం కాకపోవడం వల్ల 'మెరిట్ వర్సెస్ రిజర్వేషన్' అనే చర్చ పదేపదే ఒకే చోటికి వచ్చి ఆగిపోతుంది. రిజర్వేషన్‌ను ప్రతిభను తొలగించే వ్యవస్థగా చూడటం సరికాదు. భారత రాజ్యాంగ వ్యవస్థలో రిజర్వేషన్ అనేది సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించేందుకు ఉపయోగపడే ఒక సాధనం. 2026 మార్చిలో సుప్రీంకోర్టు కూడా ఈ విషయాన్ని స్పష్టం చేసింది. రిజర్వేషన్‌కు అర్హులైన అభ్యర్థులకు వయస్సు, ఫీజు వంటి సడలింపులు ఇవ్వడం మెరి ట్‌ను తగ్గించడం కాదనీ, అవి పోటీకి చేరుకునే పరి స్థితులను సమానం చేసే చర్యలనీ కోర్టు పేర్కొంది. అంటే 'సమాన పోటీ' అనే మాటకు కూడా ఒక ముందస్తు అర్థం ఉంది. అందరూ ఒకే స్టార్టింగ్ లైన్ వద్ద నిలబడి ఉన్నప్పుడు మాత్రమే పందెం ఫలితాన్ని పూర్తిగా వ్యక్తిగత సామర్థ్యంగా చూడటం సాధ్యం. కానీ సమాజంలో స్టార్టింగ్ లైన్లే వేర్వేరుగా ఉంటే? అప్పుడు చివర్లో వచ్చిన మార్కును మాత్రమే చూసి 'ఎవరు ఎక్కువ మెరిట్?' అని అడగటం అనేది ఫలితాన్ని కొలవడం మాత్రమే అవుతుంది; ఫలితం ఏర్పడిన సామాజిక ప్రక్రియను కొలవడం కాదు. అయితే అవకాశాల అసమానతలను తగ్గించడానికి రిజర్వేషన్ ఒక్కటే సరిపోతుందా? పిల్లవాడు పోటీ పరీక్షకు వచ్చేలోపు పది సంవత్సరాల విద్యలోనే అసమానతలు ఏర్పడితే, చివర్లో సీట్లను పంచడం మాత్రమే సమానత్వం ఎట్లా అవుతుంది? ప్రభుత్వ పాఠశాలల నాణ్యత, ఉపాధ్యా యుల లభ్యత, ప్రాథమిక విద్య, భాషా సామర్థ్యం, డిజి టల్ సదుపాయాలు, పోటీ పరీక్షల ఉచిత శిక్షణ, మొదటి తరం విద్యార్థులకు మార్గదర్శకత్వం-- ఇవన్నీ బలపడాలి. అందువల్ల 'మెరిట్'ను సామాజిక నేపథ్యం లేని స్వచ్ఛమైన వ్యక్తిగత ప్రతిభగా ఊహించడం మాత్రం సమస్య. 'మెరిట్ ఎవరిది?' అనే ప్రశ్న కంటే ముందు 'మెరిట్ ఏర్పడటానికి అవకాశం ఎవరికెంత దొరికింది?' అన్న ప్రశ్న వేయాలి.

# గురువు విలువే సమాజ విలువ..

## అక్టోబరు 5న ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం



ప్రతి విద్యార్థి మనిషిగా రూపొందడానికీ, సమాజానికి కావల సిన నైపుణ్యాలు, ఉత్తమ సమాజ నిర్మాణానికి దోహదపడే వ్యక్తిత్వం, పని--అభ్యసన సమ్మేళనం, జీవితానికి సిద్ధపడే వ్యక్తిత్వ నిర్మాణానికీ సాధికారత కలిగిన ఉపాధ్యాయుడు అవసరం. ఈ లక్ష్యాలను సాకారం చేసు కోవడం సమాజాలు ఉపాధ్యాయులను, ఉపా ధ్యాయ వృత్తిని ఎంత విలువైనదిగా భావిస్తా యనే దానిపై ఆధారపడి ఉంటుంది. నిజానికి, మనం ఉపాధ్యాయులకు ఇచ్చే విలువ, మనం భవిష్యత్ తరాలకు ఇచ్చే విలువను ప్రతిబింబిస్తుంది. అరవై ఏళ్ల క్రితం, యునెస్కో, అంతర్జా తీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) ఉపాధ్యాయుల స్థితికి సంబంధించిన సిఫార్సులను ఆమోదించాయి. బోధన అనేది ప్రజల గుర్తింపునకు అర్హమైన వృత్తి అని, దాని బాధ్యతలను నెర వేర్చడానికి అవసరమైన సహకారం, మద్దతు ఉండాలనే అభి ప్రాయాన్ని తెలియజేశాయి. అరవై ఏళ్ల తర్వాత కూడా, ఆ సిఫార్సుల ప్రధాన ఉద్దేశ్యం ప్రాసంగికంగా ఉంది. ఉపాధ్యాయులకు అండగా నిలబడటం అనేది వారు తమ పనిని సమర్థవంతంగా నిర్వహించడానికి అవసరమైన పరిస్థి తులు ఉన్నాయని నిర్ధారించడంతో ప్రారంభమవుతుంది. ఇందులో అధిక--నాణ్యతగల ఉపాధ్యాయ విద్య, శిక్షణ, నిరంతర వృత్తిపరమైన అభ్యాసానికి అవకాశాలు, సురక్షితమైన, సహాయకరమైన పని పరిస్థితులు ఉంటాయి.

### అరవై ఏళ్ల తర్వాత కూడా...

ప్రపంచానికి 2030 నాటికి 5 కోట్ల అదనపు ఉపాధ్యా యులు అవసరమని అంచనా. కొత్త ఉపాధ్యాయులను నియ మించడం ఎంత అవసరమో, అనుభవజ్ఞులైన వారిని నిలుపు కోవడం, ప్రేరణాత్మకమైన, ప్రతిఫలదాయకమైన, స్థిరమైన వృత్తి మార్గాలను అందించేలా చూడటం కూడా అంతే అవసరం. ఇందులో మహిళా ఉపాధ్యాయులు నాయకత్వ స్థానాలను చేపట్టే అవకాశాలు కూడా ఉన్నాయి. బోధనలో, బోధన ద్వారా లింగ సమానత్వాన్ని ముందుకు తీసుకెళ్లడం అనేది నిరంతర లింగ వైరుధ్యాలు, అసమా నతలను పరిష్కరించడానికి చాలా అవసరం. ఉపాధ్యాయుల అంతస్తు/స్థాయిని కాపా డటం, ప్రోత్సహించడం అనేది వృత్తి ప్రాము ఖ్యతను గుర్తించడం కంటే ఎక్కువ అవసరం. ఉపాధ్యాయుల స్థితికి సంబంధించిన సిఫార్సుల 60వ వార్షికోత్సవం జరుపు కొంటున్న సందర్భంలో ఉన్నాం. 1966 నాటి సిఫార్సులను సవరించడానికి... ఇరవై ఒకటవ శతాబ్దంలో బోధన వాస్తవాల్ని ప్రతిబింబించేలా చూడటంలో ప్రాథమిక ఉద్దేశ్యం మారలేదు. నేడు, ఉపాధ్యాయులు కృత్రిమ మేధస్సుతో సహా వాతావరణ మార్పు, సంఘర్షణ, స్థానభ్రంశం, నిరంతర అసమానతలు, పెరుగుతున్న వైవిధ్యమైన అభ్యాస వాతావర ణాలతో రూపుదిద్దుకున్న ప్రపంచంలో విద్యార్థులకు విద్యను అందిస్తున్నారు. ఉపాధ్యాయ వృత్తి స్థాయిని ముందుకు తీసు కెళ్లడం ద్వారా... ప్రతి ఉపాధ్యాయుడు, ప్రతిచోటా, మరింత అంకిత భావంతో పని చేసేలా అండగా నిలబడాలి.

# హార్మూజ్ ఉద్రిక్తతల వేళ.. వ్యూహాత్మక ప్రత్యామ్నాయంగా ఐమెక్




హార్మూజ్ జలసంధి ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన, వాణిజ్య భద్రతకు సవాళ్లు విసురుతున్న సమయంలో.. భారత్ ప్రతిపాదించిన ఇండియా-మిడిల్ ఈస్ట్-యూరప్ ఎకనామిక్ కారిడార్ (ఐమెక్)పై మరోసారి దృష్టి పడుతోంది. పశ్చిమాసియాలో సముద్ర మార్గాలపై పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ముప్పులు, బాబ్-అల్-మండేబ్ సంక్షోభం నేపథ్యంలో.. గల్ఫ్ ప్రాంతాన్ని భూమార్గం ద్వారా యూరప్‌తో అనుసంధానించే ఐమెక్ ప్రత్యామ్నాయ వాణిజ్య మార్గంగా ప్రాధాన్యం సంతరించుకుంటోంది. భారత్ నుంచి గల్ఫ్, అక్కడి నుంచి సౌదీ అరేబియా, జోర్డాన్ మీదుగా ఇజ్రాయెల్ తీరానికి, అక్కడి నుంచి యూరప్‌కు చేరే ఈ మల్టీమోడల్ కారిడార్ భవిష్యత్ సరఫరా గొలుసుల్లో కీలక మార్పులకు దారితీసే అవకాశాలను తెరపైకి తెస్తోంది.

### మన పశ్చిమ తీరం నుండి ప్రారంభమై..

ఇటీవల న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి సాధారణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా, గల్ఫ్ సహకార మండలి (జీసీసీ) భేటీలో ఇరాన్ నియంత్రణకు దూరంగా మిడిల్ ఈస్ట్ ఇంధన మౌలిక వసతులను విస్తరించాల్సిన అవసరంపై అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్యలు ఐమెక్ ప్రాధాన్యతను మరోసారి తెరపైకి తెచ్చాయి. దీంతో ఐమెక్ కేవలం వాణిజ్య మార్గమే కాకుండా, వ్యూహాత్మక భద్రతా ప్రత్యామ్నాయంగా కూడా ప్రాధాన్యం పొందుతోంది. కాగా ఐమెక్ కారిడార్ మనదేశంలోని పశ్చిమ తీరం (ముంబై) నుండి ప్రారంభమై, సముద్ర మార్గం ద్వారా యూఏఈలోని ఫ్యుజిరా పోర్టుని చేరుకుంటుంది. అక్కడి నుండి సౌదీ అరేబియా, జోర్డాన్ మీదుగా ఇజ్రాయెల్‌లోని హైఫా ఓడరేవుకు రైలు మార్గం ద్వారా సరుకు రవాణా చేస్తారు. మళ్లీ హైఫా నుంచి సముద్ర మార్గం ద్వారా యూరప్ (గ్రీస్/ఇటలీ) దేశాలకు అనుసంధానించబడుతుంది.

### హార్మోజ్‌పై ఇరాన్ పట్టుతో చిక్కులు...

ప్రపంచవ్యాప్తంగా రవాణా అయ్యే ముడి చమురులో దాదాపు 20 శాతం హార్మూజ్ జలసంధి గుండానే సాగుతుంది. పర్షియన్ సింధుశాఖను, ఒమన్ సింధుశాఖతో కలిపే ఈ ఇరుకైన సముద్ర మార్గంపై ఇరాన్‌కు గల పట్టు వల్ల ఎప్పుడు ఏ చిన్న ఉద్రిక్తత తలెత్తినా ప్రపంచ ఇంధన మార్కెట్లు అల్లకల్లోలమవుతున్నాయి. భారత్‌కు సైతం తన చమురు దిగుమతులకు ఈ మార్గమే కీలకం కావడం వల్ల ఇక్కడ జరిగే ప్రతిష్టంభన దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఈ భౌగోళిక-రాజకీయ దుర్బలత్వానికి శాశ్వత పరిష్కారంగానే 2023 జీ-20 సదస్సులో భారత్, అమెరికా, యూఏఈ, సౌదీ అరేబియా, యూరప్ దేశాలు కలిసి 'ఐమెక్'కు పునాది వేశాయి. సముద్ర మార్గాలు, రైలు లింకులు, విద్యుత్ కేబుళ్లు, క్లీన్ హైడ్రోజన్ పైప్‌లైన్లతో కూడిన ఈ మల్టీ-మోడల్ కారిడార్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే రవాణా సమయం 40 శాతానికి పైగా తగ్గడమే కాకుండా, ప్రమాదకరమైన జలసంధులపై ఆధారపడాల్సిన అవసరం తప్పుతుంది.

### ఇరాన్ సంక్షోభంతో పెరిగిన అవసరం...

గత కొంతకాలంగా గాజా, ఇరాన్ ఘర్షణలతో మిడిల్ ఈస్ట్‌లో నెలకొన్న అస్థిరత, ఇజ్రాయెల్‌తో గల్ఫ్ దేశాల సంబంధాల్లో వచ్చిన ఒడిదుడుకులు, నిధులపై సందిగ్ధత కారణంగా ఐమెక్ పురోగతి కొంత మందగించింది. అయితే ప్రస్తుత ఇరాన్ సంక్షోభం ఈ ప్రాజెక్టు అవసరాన్ని మరింత పెంచింది. ఇటలీ వంటి యూరప్ దేశాలు కూడా ట్రీస్టేను లాజిస్టిక్స్ హబ్‌గా అభివృద్ధి చేస్తూ ఐమెక్‌లో భాగస్వామ్యం కావడానికి ఆసక్తి చూపుతున్నాయి. చైనా 'బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్'కి ప్రత్యామ్నాయంగా, ఇటు ఇరాన్ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు అడ్డుకట్ట వేయడానికి ఐమెక్ ఒక అస్త్రంగా మారింది. భారత ఎగుమతులకు సురక్షితమైన, వైవిధ్యభరితమైన సరఫరా మార్గాన్ని అందించే ఐమెక్‌ను కేవలం ప్రణాళికగా కాకుండా, నిధులు, మౌలిక వసతుల నిర్మాణంతో వేగంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది.

### బాబ్-అల్-మండేబ్ సంక్షోభానికి కూడా చెక్...

హార్మూజ్‌తో పాటు బాబ్-అల్-మండేబ్ జలసంధిపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు 'ఐమెక్' వ్యూహాత్మక ప్రత్యామ్నాయంగా నిలవనుంది. హౌతీ దాడుల కారణంగా ప్రస్తుతం ప్రపంచ నౌకాయానం తీవ్రంగా దెబ్బతింది. దీంతో చాలా నౌకలు సుయెజ్ కాలువ గుండా వెళ్లకుండా, వేల కిలోమీటర్ల అదనపు దూరాన్ని చుడుతూ ఆఫ్రికా ఖండం (కేప్ ఆఫ్ గుడ్ హోప్) మీదుగా ప్రయాణించాల్సి వస్తోంది. దీనివల్ల సమయం, రవాణా ఖర్చులు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత పశ్చిమ తీరంలోని పోర్టుల నుంచి యూఏఈలోని జెబెల్ అలీ లేదా ఫుజైరాకు చేరే సరుకును, అక్కడి నుంచి సౌదీ అరేబియా-జోర్డాన్ మీదుగా రైల్వే మార్గంలో ఇజ్రాయెల్‌లోని హైఫా పోర్టుకు తరలించి, ఆపై యూరప్‌కు చేరుకుంటుంది. అంటే, ఇటు హార్మూజ్ జలసంధిని నియంత్రిస్తున్న ఇరాన్ ముప్పును, అటు బాబ్-అల్-మండేబ్‌ను అల్లకల్లోలం చేస్తున్న హౌతీల ముప్పును ఈ ఒకే ఒక్క కారిడార్ ఏకకాలంలో బైపాస్ చేస్తుంది. ఈ విధంగా పశ్చిమాసియాలోని అత్యంత ప్రమాదకరమైన రెండు సముద్ర జలసంధుల భౌగోళిక-రాజకీయ చదరంగంలో 'ఐమెక్' ఒక తిరుగులేని వ్యూహాత్మక అస్త్రంగా మారుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

RNI : APTEL/25/A0108 www.mahinewsindia.com epaper: https://epaper.mahinewsindia.com

# ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లకు తక్షణమే బడ్జెట్ కేటాయించాలి

**పథకాలను పునరుద్ధరించి నిరుపేద కుటుంబాలకు ఆర్థిక చేయూత ఇవ్వాలి**

**నిధులు కేటాయించకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతాం**



అనంతపురం, మహి న్యూస్ అక్టోబరు 04: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన నిరుపేద కుటుంబాల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లకు ప్రభుత్వం తక్షణమే తగిన బడ్జెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ కార్పొరేషన్ ఏర్పాటు అనంతరం కేంద్ర,



రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పలు సంక్షేమ, ఆర్థికాభివృద్ధి పథకాలు అమలు చేశారని తెలిపారు. ప్రభుత్వ వార్షిక బడ్జెట్‌లో జనాభా నిష్పత్తి ప్రకారం ప్రత్యేక నిధులు కేటాయించడంతో పాటు, కేంద్ర ఆర్థిక సంస్థల ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు అందించే విధానం ఉండేదని పేర్కొన్నారు. అయితే గత కొంతకాలంగా కార్పొరేషన్ల ద్వారా అమలయ్యే ఆర్థికాభివృద్ధి పథకాలు సక్రమంగా కొనసాగకపోవడంతో నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ సహాయం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేషన్లను బలోపేతం చేసి, స్వయం ఉపాధి, రుణాలు, ఆర్థిక సహాయం అందించే పథకాలను పునరుద్ధరించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లకు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించి, పెండింగ్‌లో ఉన్న పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి తక్షణ చర్యలు తీసుకోకపోతే త్వరలో ఆమరణ నిరాహార దీక్షకు శ్రీకారం చుట్టడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

## పీజీఆర్‌ఎస్‌పై క్యూఆర్ కోడ్‌తో స్పందన తెలియజేయండి

**పీజీఆర్‌ఎస్ సేవలపై ప్రజల అభిప్రాయాల సేకరణ**

**ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాల్లో క్యూఆర్ కోడ్ ఏర్పాటు**

**అర్జీల స్థితిని 1100 ద్వారా తెలుసుకునే అవకాశం**




అనంతపురం, అక్టోబర్ 5: (మహి న్యూస్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) సేవలపై ప్రజలు తమ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ కోరారు. పీజీఆర్‌ఎస్ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచడంతో పాటు ప్రజల సంతృప్తిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఫీడ్‌బ్యాక్ విధానాన్ని అమలు చేస్తోందని తెలిపారు. జిల్లా, మండల స్థాయి పీజీఆర్‌ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాల్లో క్యూఆర్ కోడ్‌లను స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు పీజీఆర్‌ఎస్ సేవలను పొందిన వెంటనే మొబైల్ ఫోన్‌తో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని నమోదు చేయవచ్చని తెలిపారు. ఎక్కువ మంది ప్రజలు ఫీడ్‌బ్యాక్ ఇచ్చేలా నోటీసు బోర్డులు, హెల్ప్‌డెస్క్‌లు, ఫిర్యాదుల కౌంటర్ల వద్ద కూడా క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. పీజీఆర్‌ఎస్ అర్జీల స్థితిగతులను తెలుసుకోవడానికి 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం, మండల కార్యాలయాల్లో నిర్వహించే పీజీఆర్‌ఎస్‌లో అర్జీలు సమర్పించి, వాటిపై తమ స్పందనను క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేయాలని ప్రజలకు సూచించారు.

## శింగనమలలో నేడు మంత్రి పయ్యావుల కేశవ్ పర్యటన



**పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్న మంత్రి**

**ఉదయం 10 గంటలకు కార్యక్రమాలు ప్రారంభం**

అనంతపురం, అక్టోబర్ 4: (మహి న్యూస్): శింగనమల నియోజకవర్గంలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించే అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి పాల్గొని, కార్యక్రమాలను ప్రారంభించనున్నారు.

## వాహనదారులకు శుభవార్త.. అమరావతిలో సరికొత్త స్మార్ట్ రోడ్లు.. ఈ ప్రాంతాల్లో..



**అమరావతి,:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో సరికొత్త రోడ్ల నిర్మాణానికి ఏపీసీఆర్డీఏ శ్రీకారం చుట్టింది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా గ్రీన్ మొబిలిటీకి పెద్దపీట వేస్తూ పాదచారులు, సైక్లిస్టుల కోసం ప్రత్యేక రహదారులను అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం చీ9 రోడ్డు సమీపంలో మోడల్ వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌ల నిర్మాణం జరుగుతోంది. సాధారణ నగరాల్లో మాదిరిగా కేవలం వాహనాల మార్గమే కాకుండా, మాస్టర్‌ప్లాన్‌లో నాన్-మోటరైజ్డ్ ట్రాన్స్‌పోర్ట్‌కు అత్యంత ప్రాధాన్యత కల్పించారు. కారు లేదా బైక్ లేకపోయినా సురక్షితంగా ప్రయాణించేలా ఈ స్మార్ట్ రోడ్లను డిజైన్ చేస్తున్నారు. ఈ ప్రత్యేక స్మార్ట్ రోడ్లలో 3 మీటర్ల ఫుట్‌పాత్, 3 మీటర్ల సైకిల్ ట్రాక్, వీటి మధ్య మరో 3 మీటర్ల గ్రీన్ బెల్ట్ ఉండేలా ప్రణాళిక రూపొందించారు. ఫుట్‌పాత్‌ను సైకిల్ ట్రాక్ కంటే కొంత ఎత్తులో లేదా ఒకే స్థాయిలో ఉంచే రెండు రకాల డిజైన్లను అధికారులు పరిశీలిస్తున్నారు. సైక్లిస్టులకు ప్రత్యేక గుర్తింపు ఉండేలా ప్రత్యేక రంగులు లేదా పిగ్మెంటేషన్‌ను ఉపయోగించనున్నారు. దీనివల్ల ఏది వాహనాల మార్గం, ఏది సైకిల్ లేదా పాదచారుల మార్గం అనేది స్పష్టంగా తెలుస్తుంది. అంతేకాకుండా.. స్టార్మ్ వాటర్ డ్రైన్ల పైన సైకిల్ ట్రాక్‌లు, ఐసీటీ యుటిలిటీ డక్టు, సీవర్ లైన్ల పైన పాదచారుల మార్గాలను ఏర్పాటు చేసే వినూత్న విధానాన్ని పరిశీలిస్తున్నారు. రోడ్డు, డ్రైనేజీ, పాదచారులు, సైకిల్ ట్రాక్‌లన్నింటినీ ఒకే సమగ్ర డిజైన్‌లో ఇక్కడ అమర్చుతున్నారు. ఏపీసీఆర్డీఏ ప్రణాళిక ప్రకారం అమరావతిలో సుమారు 3,200 కిలోమీటర్ల మేర పాదచారుల మార్గాలు, సైకిల్ ట్రాక్‌ల నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయనున్నారు. పార్కులు, ఓపెన్ స్పేస్‌లు, గ్రీన్ ఏరియాలను ఈ నెట్‌వర్క్‌తో అనుసంధానం చేయనున్నారు. వ్యక్తిగత వాహనాల వినియోగం పెరిగే కొద్దీ ట్రాఫిక్ ఒత్తిడి, కాలుష్యాన్ని తగ్గించేందుకు నడక, సైక్లింగ్, ప్రజా రవాణాను మిళితం చేసి గ్రీన్ మొబిలిటీని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ స్మార్ట్ రోడ్లలో అందమైన టైల్స్‌తో పాటు భద్రత, వెలుతురు, వర్షపు నీటి పారుదల, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలకు కూడా అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. అమరావతి మొత్తం ఈ స్మార్ట్ రోడ్లు విస్తరిస్తే, రాజధాని రూపురేఖలతో పాటు ప్రజల ప్రయాణ విధానం పూర్తిగా మారిపోనుంది.

# అనంతపురంలో ఘనంగా హెరిటేజ్ వాక్

**చారిత్రక వారసత్వ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన**

**హెరిటేజ్ వాక్‌లో పాల్గొన్న కలెక్టర్ ఓ.ఆనంద్, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్**

**ప్రాచీన కట్టడాల విశిష్టతను వివరించిన విద్యార్థినులు**

అనంతపురం, అక్టోబర్ 5: (మహి న్యూస్): అనంతపురం నగరంలోని చారిత్రక కట్టడాలు, సంస్కృతి, వారసత్వ సంపద



పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ఆదివారం హెరిటేజ్ వాక్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సుయశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఓల్డ్ టౌన్‌లోని విక్టోరియా మెమోరియల్ హాస్పిటల్ వద్ద ప్రారంభమైన హెరిటేజ్ వాక్ చెన్నకేశవ స్వామి దేవాలయం, విరూపాక్ష స్వామి దేవాలయం, జామియా మసీదు, బసవన్న కట్ట, ఐరన్ బ్రిడ్జ్ మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో క్రీస్తుశకం 15వ శతాబ్దం నుంచి అనేక చారిత్రక కట్టడాలు ఉన్నాయని తెలిపారు. వాటిని పరిరక్షించడంతో






పాటు వాటి చరిత్ర, విశిష్టతను భావితరాలకు అందించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని చెప్పారు. ప్రాచీన కట్టడాల ఘనతను ప్రజలకు పరిచయం చేసేలా రాష్ట్రంలో తొలిసారిగా అనంతపురం జిల్లాలో 'బ్లూ ప్లేక్' కాన్సెప్ట్‌ను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి వారసత్వ కట్టడాన్ని పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సుయశ్ కుమార్ మాట్లాడుతూ హెరిటేజ్ వాక్‌ను భవిష్యత్తులోనూ నిర్వహిస్తామని, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని జిల్లాలోని చారిత్రక వారసత్వాన్ని తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. హెరిటేజ్ వాక్‌లో భాగంగా కళాశాల విద్యార్థినులు ఆయా చారిత్రక కట్టడాల నేపథ్యం, నిర్మాణ విశిష్టత, ప్రాధాన్యతలను వివరించారు. కార్యక్రమం ఐరన్ బ్రిడ్జ్ వద్ద ముగిసింది. హెరిటేజ్ వాక్‌లో పాల్గొన్న పలువురు మాట్లాడుతూ



తమకు కట్టడాల చరిత్ర, ప్రాధాన్యతపై మరింత అవగాహన కలిగిందని తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ జశ్వంత్ రావు, రాష్ట్ర పురావస్తు, ప్రదర్శనశాలల శాఖ సహాయ సంచాలకులు స్వామి నాయక్, హెరిటేజ్ వాకర్స్, ఆయుష్ మెడికల్ అధికారి లాల్యానాయక్, నగర ప్రముఖులు, స్వచ్ఛంద కార్యకర్తలు, గైడ్స్, పురావస్తు, మున్సిపల్, పోలీసు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు పీజీఆర్ఎస్.. 1100 సేవలను వినియోగించుకోండి

**ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక**

**కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్, రెవెన్యూ క్లినిక్ నిర్వహణ**

**అర్జీల స్థితిని 1100 ద్వారా తెలుసుకునే అవకాశం**

**జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఓ.ఆనంద్ సూచన**



అనంతపురం, అక్టోబర్ 5: (మహి న్యూస్): ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి మీకోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సూచించారు. గతంలో దాఖలు చేసిన అర్జీలు ఇంకా పరిష్కారం కాకపోయినా, వాటి స్థితి తెలుసుకోవాలన్నా 1100 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను మీకోసం వెబ్‌సైట్ ద్వారా కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. రెవెన్యూ పరిధిలోని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాల్లో 'మీకోసం టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100' అనే బ్యానర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

### కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్, రెవెన్యూ క్లినిక్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్), రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను నేడు అనంతపురం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి రెవెన్యూ భవనంలో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నారు. అర్జీదారులు తమ వివరాలతో పాటు సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలను అర్జీలో నమోదు చేసి సమర్పించాలని కలెక్టర్ సూచించారు. గతంలో అర్జీ సమర్పించిన వారు సంబంధిత రసీదు స్లిప్‌ను తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. సమస్య పరిష్కారమైనప్పుడు అర్జీదారుల ఫోన్‌కు సందేశం వస్తుందని, నోటీసులు, ఎండార్స్‌మెంట్లను వాట్సాప్ ద్వారా, అవసరమైన వాటిని రిజిస్టర్ పోస్టు ద్వారా పంపిస్తున్నట్లు తెలిపారు. అర్జీ సమర్పించే సమయంలో వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. అదేవిధంగా డివిజన్, మండల, ఎస్‌జీఎస్‌డబ్ల్యూ స్థాయిల్లోనూ ఉదయం 10 గంటల నుంచి పీజీఆర్‌ఎస్ గ్రీవెన్స్ డే నిర్వహించాలని ఆర్‌డీఓలు, తహసీల్దార్లు, పీడీఓలను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# సుంకరపాలెంలో ఘనంగా 75వ గణపతి నవరాత్రి మహోత్సవాలు

**వైభవంగా భారీ అన్న సమారాధన.. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు**

**ఎమ్మెల్యేకు పూర్ణకుంభ స్వాగతం.. ఘనంగా సన్మానం**

**గ్రామ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రాలు సమర్పించిన స్థానికులు**



తాళ్లరేవు, మహి న్యూస్, అక్టోబర్ 4:: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం సుంకరపాలెం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారి 75వ గణపతి నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్వామివారి ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలతో సుంకరపాలెం గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. స్వామివారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ముమ్మిడివరం నియోజకవర్గ శాసనసభ్యుడు దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) హాజరయ్యారు. ఎమ్మెల్యే ఆలయానికి చేరుకున్న సందర్భంగా శ్రీ లక్ష్మీ గణపతి వర్తక సంఘం సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. పూర్ణకుంభంతో సంప్రదాయబద్ధంగా స్వాగతం పలుకుతూ, పూలవర్షం కురిపించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజును శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన పత్రాన్ని అందజేయడంతో పాటు ప్రత్యేక బహుమతిని సమర్పించి తమ గౌరవాభిమానాలను వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు స్వామివారి సన్నిధికి చేరుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గణపతి స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. 75వ గణపతి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ వేడుకలకు ప్రత్యేక అతిథులుగా యానాం ఎస్పీ వరదరాజన్, సీఐ డి. సురేష్ బాబు పోలీసు సిబ్బందితో కలిసి హాజరయ్యారు. స్వామివారిని దర్శించుకుని అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ ఆధ్యాత్మిక వేడుకలో పోలీసు ఉన్నతాధికారుల రాక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

### భక్తులకు అన్నప్రసాద వితరణ.. ఆధ్యాత్మిక శోభతో ఆలయ ప్రాంగణం

శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారి 75వ గణపతి నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన భారీ అన్న సమారాధనకు భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. ఉదయం నుంచే ఆలయానికి భక్తులు చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన అన్న సమారాధనలో గ్రామస్తులు, మహిళలు, యువకులు, వృద్ధులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి సన్నిధిలో భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డిస్తూ నిర్వాహకులు సేవాభావాన్ని చాటుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్న సమారాధన ఏర్పాట్లు చేపట్టారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా ఆధ్యాత్మికతతో పాటు సామాజిక ఐక్యత, సేవాభావం వెల్లివిరిశాయి. గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని అందంగా అలంకరించడంతో పాటు భక్తుల రాకతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి.

### ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేకు వినతులు

మరోవైపు, స్వామివారి అన్న సమారాధన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజును స్థానిక గ్రామస్తులు కలిసి తమ ప్రాంతానికి సంబంధించిన పలు సమస్యలనువివరించారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయా సమస్యల పరిష్కారం కోరుతూ పలువురు వినతిపత్రాలను సమర్పించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపాలని, అభివృద్ధి పనులకు ప్రాధాన్యత కల్పించాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేను స్థానికులు కలిసి తమ సమస్యలను నేరుగా వివరించడంతో ఈ వేడుకలు ప్రజా సమస్యల ప్రస్తావనకు కూడా వేదికగా నిలిచాయి. ప్రజాప్రతినిధులు గ్రామస్థులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకునే అవకాశం కల్పించిన ఈ కార్యక్రమం స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకుంది. 75వ గణపతి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమం భక్తుల కోలాహలం, నాయకుల రాక, ఘన సన్మానాలు, ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా సాగింది. సంప్రదాయాలు, భక్తి భావం, సామాజిక సేవ కలగలిసిన ఈ వేడుకలు సుంకరపాలెం గ్రామంలో చిరస్మరణీయంగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో తాళ్లరేవు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దూలిపూడి వెంకటరమణ (బాబీ ) సాగునీటి సంఘం డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ వేగేశ్న భాస్కర్ రాజు, పెద్దిరెడ్డి రవికుమార్, క్లస్టర్ ఇన్‌చార్జ్ మోపూరి వెంకటేశ్వరరావు, యానాం వర్తక సంఘం అధ్యక్షుడు నల్ల వెంకన్న, నరహరిశెట్టి వీరబాబు, పెద్దిరెడ్డి విఘ్నేశ్వరరావు, మాగాపు శ్రీనివాసరావు, గుంటముక్కల సూరిబాబు, మోపురి నాయుడు, టేకుమూడి లక్ష్మణరావు, హంసాని రామలక్ష్మణుడు, నందికొల్ల సత్తిబాబు,నల్లం నాగబాబు,నరహరిశెట్టి సూర్యనారాయణ, కనకాల శ్రీనివాసు, శ్రీరామ్, వినోద్, బద్రి, నరహరిశెట్టి గణేష్,కూటమి నాయకులు, శ్రీ లక్ష్మీ గణపతి వర్తక సంఘం సభ్యులు, గ్రామస్తులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



# యుగపురుషుడు అన్న ఎన్టీఆర్..!

## కాచవరం ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణలో జూలకంటి



కారంపూడి ( కాచవరం ) అక్టోబర్ 4: (మహి న్యూస్): అన్నీరంగాల అభ్యున్నతికి పాటుపడి.., సామాజిక సంస్కరణలకు రాజకీయ బీజం వేసిన మహనీయులు, యుగపురుషుడు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు అన్న ఎన్టీఆర్ అని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కొనియాడారు. మండల పరిధిలోని కాచవరం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆదివారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చేతులమీదిగా ప్రారంభించారు. పూలలతో ఘనంగా నివాళులర్పించి.., ఎన్టీఆర్ చూపిన మార్గంలో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పంగులూరి అంజయ్య, పంగులూరి పుల్లయ్య, మునిగోటి సత్యనారాయణ, చప్పిడి రాము, బాలకృష్ణ, తండా మస్తాన్ వలి, షేక్ రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని కార్యాలయాల్లో నేడు పీజీఆర్ఎస్

### జిల్లా, మండల స్థాయిలో పకడ్బందీగా నిర్వహణ

### అర్జీల వివరాలకు టోల్‌ఫ్రీ నంబర్ 1100

### క్యూఆర్ కోడ్‌తో స్పందనకు అవకాశం

గుంటూరు, అక్టోబర్ 5: (మహి న్యూస్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను నేడు జిల్లా, మండల స్థాయిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. ప్రజలు నేరుగా పీజీఆర్ఎస్‌లో అర్జీలు సమర్పించడంతో పాటు 'మీకోసం' వెబ్‌సైట్ ద్వారా కూడా సమస్యలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. పీజీఆర్ఎస్ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేసి తమ అర్జీల వివరాలు, పరిష్కార స్థితిని తెలుసుకోవచ్చని సూచించారు. అలాగే పీజీఆర్ఎస్ సేవలపై ప్రజలు క్యూఆర్ కోడ్ ద్వారా తమ స్పందనను తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన హజ్ కమిటీ చైర్మన్ హసన్ భాష

### బుర్రిపాలెంలో పీఎంఏవై-గ్రామీణ్ 2.0 కార్యక్రమం

### సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు మర్యాదపూర్వక కలయిక





గుంటూరు, అక్టోబర్ 4: (మహి న్యూస్): గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గం బుర్రిపాలెంలో నిర్వహించిన పీఎంఏవై--గ్రామీణ్ 2.0 కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హాజీ షేక్ హసన్ భాష మర్యాదపూర్వకంగా కలిశారు. హెలిప్యాడ్ వద్ద సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌లకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా హసన్ భాషను చంద్రబాబు కేంద్ర మంత్రికి పరిచయం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో కూటమి నాయకులతో కలిసి హసన్ భాష పాల్గొన్నారు.

# బుర్రిపాలెంలో 3 లక్షల ఇళ్లకు శంకుస్థాపన

### పీఎంఏవై-గ్రామీణ్ 2.0లో భాగంగా కార్యక్రమం

### 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ ఇళ్ల పైలట్ ప్రాజెక్టుకు శ్రీకారం

### కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో కలిసి ప్రారంభించిన సీఎం చంద్రబాబు





బుర్రిపాలెం/గుంటూరు, అక్టోబర్ 4: (మహి న్యూస్): గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం పర్యటించారు. పీఎంఏవై--గ్రామీణ్ 2.0లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం గృహ నిర్మాణ రంగంలో 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ సాంకేతికతతో ఇళ్ల నిర్మాణ పైలట్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, కొలుసు పార్థసారథి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.



# పేదలందరికీ పక్కా ఇళ్లు.. కేంద్రం పూర్తి సహకారం

### 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి కేంద్రం తొలి విడత నిధులు

### అవసరమైతే మరో 3 లక్షల ఇళ్లు మంజూరు

### 3డీ కాంక్రీట్ ప్రింటింగ్‌తో వేగంగా, తక్కువ ఖర్చుతో నిర్మాణం

### చంద్రబాబు నాయకత్వంలో ఏపీ నంబర్ వన్ రాష్ట్రంగా ఎదుగుతుంది

### : శివరాజ్‌సింగ్ చౌహాన్



బుర్రిపాలెం/గుంటూరు, అక్టోబర్ 4: (మహి న్యూస్): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా ఎదుగుతుందని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు. బుర్రిపాలెంలో 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ సాంకేతికతతో ఇళ్ల నిర్మాణ పైలట్ ప్రాజెక్టుకు సీఎంతో కలిసి ఆయన శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు కల్పించాలన్న చంద్రబాబు లక్ష్యానికి కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో ఏపీలో 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశామని, అవి పూర్తయిన తర్వాత అవసరాన్ని బట్టి మరో 3 లక్షల ఇళ్లు, తదుపరి విడతల్లో మరిన్ని ఇళ్లు మంజూరు చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు.





### 3డీ టెక్నాలజీతో వేగంగా ఇళ్లు

3డీ కాంక్రీట్ ప్రింటింగ్ ద్వారా నిర్మాణ సమయం, వ్యయం తగ్గడంతో పాటు తక్కువ మానవ వనరులతో ఇళ్లను నిర్మించవచ్చని చౌహాన్ తెలిపారు. సుమారు ఆరు నెలల్లో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసే లక్ష్యంతో ఈ సాంకేతికతను ప్రయోగాత్మకంగా వినియోగిస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబు దూరదృష్టి, నాయకత్వాన్ని కేంద్ర మంత్రి ప్రశంసించారు. ఏపీలో కృత్రిమ మేధ, డేటా సెంటర్లు, క్వాంటం టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, అధునాతన తయారీ రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పేదల సొంతింటి కలను సాకారం చేయడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం అన్ని విధాలా సహకరిస్తుందని స్పష్టం చేశారు.





# అక్రమ లేఅవుట్లపై అధికారుల కొరడా

### కొత్తపల్లిలో కాలువ పునరుద్ధరణకు ఆదేశాలు..

### ఏడోమైలు భూములపై సమగ్ర విచారణకు ఆదేశం



మాచర్ల అక్టోబర్ 4: (మహి న్యూస్): జిల్లా కలెక్టర్, పల్నాడు వారి ఆదేశాల మేరకు, గురజాల రెవెన్యూ డివిజనల్ అధికారి మురళి పర్యవేక్షణలో మాచర్ల తహసీల్దార్ బి. కిరణ్ కుమార్ కొత్తపల్లి గ్రామంలో పర్యటించి అక్రమ లేఅవుట్లు, ఆక్రమణలపై చర్యలు చేపట్టారు. కొత్తపల్లి గ్రామంలోని సర్వే నెం. 184-జె, 184-ఐ2, 185లో ఉన్న అనధికార లేఅవుట్‌కు సంబంధించి వెండి అభిషేక్ తండ్రి గోవింద్‌ను విచారించారు. సంబంధిత రైతుకు పంచాయతీ కార్యదర్శి ద్వారా నోటీసులు జారీ చేసి, పల్నాడు పట్టణాభివృద్ధి సంస్థ ద్వారా భూమి మార్పిడికి సంబంధించిన చర్యలు సత్వరమే చేపట్టాలని ఆదేశించారు. అలాగే రోడ్లు, భవనాల శాఖ ఉప కార్యనిర్వహణ ఇంజినీర్ స్వయంగా భూమిని పరిశీలించి, రోడ్డు పోరంబోకు భూమిలో జరిగిన ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాచర్ల తహసీల్దార్‌ను సదరు భూమిని సర్వే చేయించి, అక్టోబర్ 2న ప్రచురితమైన వార్తకు సంబంధించి తాటివాగు వర్షపు నీటి ప్రవాహానికి భవిష్యత్తులో ఎలాంటి ఆటంకం కలగకుండా కాలువను పునరుద్ధరించాలని ఆదేశించారు.




### ఏడోమైలు భూములపై సమగ్ర విచారణ

తదుపరి తాళ్లపల్లి శివారు ఏడోమైలు ప్రాంతంలో సెప్టెంబర్ 28న ప్రచురితమైన ఆక్రమించి అమ్మకం వార్తపై అధికారులు పరిశీలన చేపట్టారు. తాళ్లపల్లి గ్రామంలోని సర్వే నెం. 77-1, 81-1, 844-2 తదితర సర్వే నెంబర్లకు సంబంధించి మొత్తం 4.88 సెంట్ల భూమిని పరిశీలించారు. సదరు భూములను కొనుగోలు చేసిన వారికి నోటీసులు జారీ చేసి, సమగ్ర విచారణ నిర్వహించి నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అక్రమ లేఅవుట్లు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడకుండా అధికారులు చర్యలు చేపట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# పేదల గృహ నిర్మాణంలో నూతన అధ్యాయం

### రాష్ట్రంలో 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం

### 3డీ ప్రింటింగ్ సాంకేతికతతో

### బుర్రిపాలెంలో 177 ఇళ్లు

### 2029 నాటికి ప్రతి అర్హ పేద కుటుంబానికి సొంతిల్లు లక్ష్యం





బుర్రిపాలెం/గుంటూరు, అక్టోబర్ 5: (మహి న్యూస్): రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం గృహ నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తోందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. తెనాలి రూరల్ బుర్రిపాలెంలో జరిగిన కార్యక్రమంలో 3 లక్షల గృహ నిర్మాణాల పునాది కార్యక్రమాన్ని ప్రారంభించారు. రోబోటిక్ 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ సాంకేతికతతో ప్రయోగాత్మకంగా బుర్రిపాలెంలో 100 ఇళ్లు, దివ్యాంగులకు మరో 77 ఇళ్లు నిర్మిస్తున్నట్లు పెమ్మసాని తెలిపారు. ఈ సాంకేతికత విజయవంతమైతే తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఇళ్ల నిర్మాణానికి మార్గం సుగమమవుతుందన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ 2029 నాటికి అర్హత ఉన్న ఏ పేద కుటుంబం కూడా ఇల్లు లేకుండా ఉండకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి యూనిట్ వ్యయాన్ని రూ.2.39 లక్షలుగా, పట్టణ ప్రాంతాల్లో పీఎంఏవై-2.0 కింద రూ.2.50 లక్షలుగా నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రానికి మరో 6 లక్షల ఇళ్ల అవసరం ఉందని, వాటిని కూడా 2029లోగా మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో హౌసింగ్ పథకంలో జరిగిన అవకతవకలపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధితులకు న్యాయం చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కోరారు. పేదలకు ఇళ్ల నిర్మాణంలో గతంలో జరిగిన నష్టాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పేదలకు ఆర్థిక సహాయంతో పాటు ఉపాధి హామీ, స్వచ్ఛ భారత్ మిషన్, మహిళా స్వయం సహాయక సంఘాల రుణాల ద్వారా లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరుతుందని మంత్రులు తెలిపారు.



# ప్రకృతి సాగులో ఏపీ దేశానికి ఆదర్శం

### బుర్రిపాలెంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్

### రైతు జానకీరామ్‌ను అభినందించిన కేంద్ర మంత్రి

### ప్రకృతి సాగుతో భూసారం, ప్రజారోగ్యానికి మేలు







తెనాలి, అక్టోబర్ 4: (మహి న్యూస్): తెనాలి నియోజకవర్గం బుర్రిపాలెంలో రైతు జానకీరామ్ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ సందర్శించారు. రసాయన ఎరువులు, పురుగుమందులు ఉపయోగించకుండా ప్రకృతి పద్ధతుల్లో సాగు చేస్తున్న జానకీరామ్‌ను కేంద్ర మంత్రి అభినందించారు. ప్రకృతి వ్యవసాయంలో అనుసరిస్తున్న పద్ధతులు, సాగు ఖర్చు, దిగుబడి వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. బీజామృతం, జీవామృతం వంటి సహజ పద్ధతులతో సాగు చేస్తున్నట్లు రైతు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందని శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. రాష్ట్రంలో 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి సాగు చేపట్టే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రకృతి సాగుతో భూసారం పెరగడంతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందుతుందని చెప్పారు. రసాయన ఎరువులతో ఎకరా వరి సాగుకు సుమారు రూ.25 వేల వరకు ఖర్చవుతుండగా, ప్రకృతి సాగు పద్ధతిలో కేవలం రూ.7 వేల వరకు ఖర్చవుతోందని రైతు జానకీరామ్ తెలిపినట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. దీంతో రైతుల సాగు ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని, ప్రకృతి ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి ధర లభించే అవకాశం ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడిని అభినందించిన కేంద్ర మంత్రి, ఈ రంగంలో ఆంధ్రప్రదేశ్ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రంలో ప్రకృతి సాగు విస్తరిస్తోందని తెలిపారు. అంతకుముందు బుర్రిపాలెంలో సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహానికి సీఎం చంద్రబాబు నాయుడు నివాళులర్పించారు.

### రాష్ట్రంలో 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం

### 3డీ ప్రింటింగ్ సాంకేతికతతో

### బుర్రిపాలెంలో 177 ఇళ్లు

### 2029 నాటికి ప్రతి అర్హ పేద కుటుంబానికి సొంతిల్లు లక్ష్యం

# పేదల గృహ నిర్మాణంలో నూతన అధ్యాయం







బుర్రిపాలెం/గుంటూరు, అక్టోబర్ 4: (మహి న్యూస్): రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం గృహ నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తోందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. తెనాలి రూరల్ బుర్రిపాలెంలో 3 లక్షల గృహ నిర్మాణాల పునాది కార్యక్రమాన్ని ప్రారంభించారు. రోబోటిక్ 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ సాంకేతికతతో ప్రయోగాత్మకంగా బుర్రిపాలెంలో 100 ఇళ్లు, దివ్యాంగులకు మరో 77 ఇళ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ సాంకేతికత విజయవంతమైతే తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఇళ్ల నిర్మాణానికి మార్గం సుగమమవుతుందని పేర్కొన్నారు. 2029 నాటికి అర్హత ఉన్న ఏ పేద కుటుంబం కూడా ఇల్లు లేకుండా ఉండకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి యూనిట్ వ్యయాన్ని రూ.2.39 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో పీఎంఏవై--2.0 కింద రూ.2.50 లక్షలుగా నిర్ణయించినట్లు చెప్పారు. రాష్ట్రానికి మరో 6 లక్షల ఇళ్ల అవసరం ఉందని, వాటిని కూడా 2029లోగా మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణ పథకంలో జరిగిన అవకతవకలపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధితులకు న్యాయం చేయాలని మంత్రి నాదెండ్ల మనోహర్ కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పేదలకు గృహ నిర్మాణంతో పాటు ఉపాధి హామీ, స్వచ్ఛ భారత్ మిషన్, మహిళా స్వయం సహాయక సంఘాల రుణాల ద్వారా అదనపు ప్రయోజనాలు కల్పించనున్నట్లు మంత్రులు తెలిపారు.

# పదో తరగతి, ఇంటర్‌లో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

## విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

## ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలి:

## మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి



తిరుపతి, అక్టోబర్ 04,మహి న్యూస్: తిరుపతిలోని పద్మావతి అతిథి గృహ సమావేశ మందిరంలో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల సాంఘిక సంక్షేమ శాఖ, స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తోందని తెలిపారు. ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు అందిస్తున్న స్పోర్ట్స్ డ్రెస్సులు, నైట్ డ్రెస్సులు, బూట్లు, తువ్వాళ్లు వంటి నిత్యావసరాలు ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాబోయే పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది పనిచేయాలని నిర్దేశించారు. ఇందుకోసం ఇప్పటి నుంచే



పకడ్బందీ ప్రణాళికను రూపొందించి, విద్యార్థుల విద్యా ప్రగతిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హాస్టళ్లలో పారిశుద్ధ్యం, నాణ్యమైన భోజనం మరియు తాగునీరు అందుబాటులో ఉండేలా క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలని స్పష్టం చేశారు. కోటలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌పై ప్రత్యేక దృష్టి సారించి, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలని సూచించారు. సమాజంలో ట్రాన్స్‌జెండర్ల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, వారి కోసం ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి అవసరమైన ఆరోగ్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు

# కాణిపాకంలో వైభవోపేతంగా భరత్ శర్మ చే 'అష్టావధానం' కార్యక్రమం




తిరుపతి, అక్టోబర్ 4,మహి న్యూస్: కాణిపాకం స్వయంభూ శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం నిర్వహణలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రముఖ శతావధాని ఉప్పలధడియం భరత్ శర్మచే "అష్టావధానం" కార్యక్రమం అత్యంత వైభవంగా రూపుదిద్దుకుంది. సెప్టెంబర్ 14 నుండి అక్టోబర్ 4 వరకు 21 రోజులపాటు కాణిపాకం క్షేత్రంలో వరసిద్ధి వినాయక స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతూ ఉండడం విదితమే. ఈ నేపథ్యంలో బ్రహ్మోత్సవాలలో చివరి రోజు, తెప్పోత్సవాల నడుమ తిరుపతికి చెందిన శతావధాని ఉప్పలధడియం భరత్ శర్మ చే అష్టావధానం కార్యక్రమం కాణిపాకం దేవాలయం ప్రాంగణంలోని 'జగద్గురు శ్రీ భారతీతీర్థ ఆస్థాన మంటపం' లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం ఈవో పెంచల కిషోర్, చైర్మన్ మణి నాయుడు ముఖ్య అతిథులుగా విచ్చేసి అష్టావధాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. శతావధాని భరత్ శర్మ తమ సాహిత్య ప్రతిభతో, సమయస్ఫూర్తితో పండితులు అడిగిన ప్రశ్నలకు దీటైన సమాధానలుగా పద్యాలను ఆలపించి, సభను విశేషంగా అలరించారు. ఈ అవధాన కార్యక్రమానికి సంచాలకులుగా ప్రముఖ సంస్కృతాంధ్ర విద్వాంసులు బ్రహ్మశ్రీ రొంపిచెర్ల యశ్వంత్ దీక్షితులు గారు వ్యవహరించగా, పృచ్ఛకులుగా నిషిద్ధాక్షరికి – 'అవధానిరత్న' బ్రహ్మశ్రీ డా. మాడుగుల అనిల్ కుమార్, సమస్యకు డా. మాడుగుల శారద, దత్తపదికి అవధానిని యు. అనన్య శర్మ, వర్ణనకు కొర్రపాటి లక్ష్మీ అలివేలు మంగ తాయారు, వ్యస్తపాదికి బ్రహ్మశ్రీ రొంపిచెర్ల యశ్వంత్ దీక్షితులు, ఆశువుకు కెందోళె హర్షవర్ధన్ పురాణపఠనం అంశానికి గుత్తి శైలజ, అప్రస్తుతప్రసంగానికి పాలూరి వేంకటరాజు శర్మ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని కాణిపాకం స్వామివారి భక్తులు, సాహిత్యప్రియులు విశేషంగా వీక్షించి ఆనందించారు.

# నేడు పీజీఆర్ఎస్.. క్యూఆర్ కోడ్‌తో స్పందనకు అవకాశం

## ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యక్రమం

## జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లోనూ నిర్వహణ

## అర్జీల స్థితిని 1100 ద్వారా తెలుసుకునే అవకాశం

## క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి సేవలపై ఫీడ్‌బ్యాక్ ఇవ్వొచ్చు



తిరుపతి, అక్టోబర్ 4: (మహి న్యూస్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను మీకోసం వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. గతంలో సమర్పించిన అర్జీలు పరిష్కారం కాకపోయినా, వాటి స్థితి తెలుసుకోవాలన్నా 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు. పాత అర్జీలకు సంబంధించిన రసీదు స్లిప్‌ను తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. పీజీఆర్ఎస్ సేవలపై ప్రజలు తమ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో ఫీడ్‌బ్యాక్‌గా నమోదు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. దీనివల్ల ప్రజల సంతృప్తి, సేవల నాణ్యతను మెరుగుపరిచేందుకు అవకాశం ఉంటుందన్నారు. అర్జీదారులు తమ వివరాలు, సమస్యకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్‌కు సందేశం వస్తుందని, నోటీసులు, ఎండార్స్‌మెంట్లను వాట్సాప్ ద్వారా, అవసరమైన వాటిని రిజిస్టర్ పోస్టు ద్వారా పంపుతున్నట్లు తెలిపారు. జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లోనూ పీజీఆర్ఎస్ కార్యక్రమాలు నిర్వహించనున్నందున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

# ఉద్యాన పంటల సాగుపై కళాజాతతో చైతన్య ప్రచారం

## సమాచార శాఖ ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు

## ఉద్యాన పంటల సాగు, ప్రభుత్వ రాయితీలపై ప్రచారం

## గ్లోబల్ హార్టికల్చర్ హబ్-రాయలసీమ రైజింగ్‌పై అవగాహన




నగరి, అక్టోబర్ 4: (మహి న్యూస్): జిల్లాను ఉద్యాన హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఉద్యాన పంటల సాగుపై గ్రామస్థాయిలో ప్రజలు, రైతులు, యువతకు అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఐపీఆర్ఓ ఎన్. వేలాయుధం పర్యవేక్షణలో నింద్ర మండలం పాదిరి పంచాయతీ పరిధిలో శనివారం రాత్రి కళాజాత చైతన్య ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రచార రథం ద్వారా రవి కళాబృందం కళాజాత ప్రదర్శన నిర్వహించి ఉద్యాన పంటల సాగు ప్రాధాన్యతను వివరించింది. ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించింది. గ్లోబల్ హార్టికల్చర్ హబ్--రాయలసీమ రైజింగ్ కార్యక్రమం ఉద్దేశాలను ప్రజలకు కళారూపాల ద్వారా వివరించారు. ఉద్యాన శాఖతో పాటు వ్యవసాయ అనుబంధ శాఖల సమన్వయంతో గ్రామస్థాయిలో ఈ చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, సమాచార శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# జర్నలిజంలో మార్పులకు అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకోవాలి

## పూతలపట్టు ఎమ్మెల్యే కె. మురళీమోహన్

## గ్రామీణ జర్నలిస్టుల పునశ్చరణ తరగతులు ముగింపు

## వార్తల్లో ప్రజా ప్రయోజనమే ప్రాధాన్యత: ఆలపాటి సురేశ్‌కుమార్

## క్రైమ్ రిపోర్టింగ్‌లో వేగం కంటే ఖచ్చితత్వం ముఖ్యం





తిరుపతి, అక్టోబర్ 4: (మహి న్యూస్): జర్నలిజంలో వస్తున్న మార్పులను స్వీకరించి, అందుకు అనుగుణంగా వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పూతలపట్టు ఎమ్మెల్యే కె. మురళీమోహన్ సూచించారు. సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన తిరుపతి జిల్లా గ్రామీణ జర్నలిస్టుల రెండు రోజుల పునశ్చరణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామీణ జర్నలిస్టుల నైపుణ్యాలను పెంపొందించేందుకు పునశ్చరణ తరగతులు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టులకు సర్టిఫికెట్లు, మీడియా అకాడమీ ప్రచురించిన పుస్తకాలను అందజేశారు. సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్‌కుమార్ మాట్లాడుతూ వార్త ప్రాధాన్యతకు గీటురాయి ప్రజా ప్రయోజనమేనని అన్నారు. వార్త ద్వారా ప్రజలకు ఎంత ప్రయోజనం కలుగుతుందనేది జర్నలిస్టుల చిత్తశుద్ధిపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ ఎ. రాఘవశర్మ మాట్లాడుతూ వార్తల్లో భాష సులభంగా, పాఠకులకు చేరువగా ఉండాలని సూచించారు.





సందర్భానుసారంగా మాండలిక పదాలను ఔచిత్యంతో ఉపయోగించవచ్చని తెలిపారు. వార్తల్లో భాషా సౌందర్యం కంటే సౌలభ్యానికే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆంధ్రజ్యోతి చీఫ్ రిపోర్టర్, స్టేట్ బ్యూరో చీఫ్ శ్రీశైలం రమేష్ మాట్లాడుతూ క్రైమ్ రిపోర్టింగ్‌లో వేగం కంటే ఖచ్చితత్వం ముఖ్యమన్నారు. పటిష్టమైన సమాచార వనరులను ఏర్పాటు చేసుకోవాలని, ఎఫ్ఐఆర్ నుంచి ఛార్జిషీట్, కోర్టు కేసుల వరకు వార్తలను ఫాలోఅప్ చేయాలని సూచించారు. సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, మోసం జరిగిన వెంటనే 1930కు ఫోన్ చేయడం ద్వారా డబ్బు రికవరీకి అవకాశం ఉంటుందని తెలిపారు. హన్స్ ఇండియా స్పెషల్ కరస్పాండెంట్ నరేష్ నందం 'ఫ్యాక్ట్ చెక్' అంశంపై మాట్లాడుతూ తప్పుడు సమాచారాన్ని ప్రచురించే ముందు పూర్తి స్థాయిలో నిజ నిర్ధారణ చేయాలని సూచించారు. ఫోటోలు, వీడియోల నిజానిజాలు తెలుసుకునేందుకు రివర్స్ ఇమేజ్ సెర్చ్, గూగుల్ ఎర్త్, ఇతర ఫ్యాక్ట్ చెకింగ్ సాధనాలను ఉపయోగించుకోవచ్చని వివరించారు. ఐజేయూ సెక్రటరీ జనరల్, సీనియర్ జర్నలిస్ట్ డి. సోమసుందర్ గ్రామీణ వార్తలు, కథనాలపై ప్రసంగిస్తూ గ్రామ, మండల స్థాయిలో జర్నలిస్టులకు ఉన్న వార్తా సేకరణ అవకాశాలను వివరించారు. సమావేశంలో తిరుపతి విశాలాంధ్రబ్యూరో ఇన్‌చార్జిడా.ఎం. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్‌పై క్యూఆర్ కోడ్‌తో స్పందన తెలియజేయండి

## ప్రజల నుంచి నిరంతర ఫీడ్‌బ్యాక్ సేకరణ

## పీజీఆర్ఎస్ కేంద్రాల్లో క్యూఆర్ కోడ్‌ల ఏర్పాటు

## అర్జీల స్థితిని 1100 ద్వారా తెలుసుకునే అవకాశం




చిత్తూరు, అక్టోబర్ 4: (మహి న్యూస్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) సేవలపై ప్రజలు తమ స్పందనను క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కోరారు. పీజీఆర్ఎస్‌ను మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించడంతో పాటు ప్రజల సంతృప్తిని మెరుగుపరిచేందుకు ఫీడ్‌బ్యాక్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా, మండల స్థాయి పీజీఆర్ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాల్లో క్యూఆర్ కోడ్‌లను స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు పీజీఆర్ఎస్ సేవలు పొందిన వెంటనే మొబైల్ ఫోన్‌తో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాలను నమోదు చేయవచ్చని తెలిపారు. నోటీసు బోర్డులు, హెల్ప్‌డెస్క్‌లు, ఫిర్యాదుల కౌంటర్ల వద్ద కూడా క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలు ఇచ్చే స్పందన అధికారిక పీజీఆర్ఎస్ పోర్టల్‌కు చేరుతుందని తెలిపారు. గతంలో సమర్పించిన అర్జీల స్థితిగతులను తెలుసుకునేందుకు 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం, మండల కార్యాలయాల్లో నిర్వహించే పీజీఆర్ఎస్‌లో ప్రజలు అర్జీలు సమర్పించి, సేవలపై తమ స్పందనను క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేయాలని కలెక్టర్ కోరారు.

# నేడు చిత్తూరు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్.. రెవెన్యూ క్లినిక్

## ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహణ

## జిల్లా స్థాయి అధికారుల సమక్షంలో ప్రజల నుంచి అర్జీల స్వీకరణ

## 1100 కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచన

చిత్తూరు, అక్టోబర్ 4: (మహి న్యూస్): చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. అర్జీదారులు తమ వివరాలతో పాటు సమస్యకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అర్జీలో నమోదు చేసి సమర్పించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం మీకోసం కాల్ సెంటర్ 1100 సేవలను కూడా వినియోగించుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# పదో తరగతి, ఇంటర్‌లో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

## విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ

## వసతి గృహాల్లో నాణ్యమైన ఆహారం, పరిశుభ్రతపై పర్యవేక్షణ

## ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలి

## సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు



తిరుపతి, అక్టోబర్ 4: (మహి న్యూస్): పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది పనిచేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఆదేశించారు. తిరుపతిలోని పద్మావతి అతిథి గృహంలో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల సాంఘిక సంక్షేమ, స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల విద్యా ప్రగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న స్పోర్ట్స్ డ్రెస్, నైట్ డ్రెస్, షూస్, టవల్స్ తదితర సౌకర్యాలు ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వసతి గృహాల్లో పరిశుభ్రత, నాణ్యమైన ఆహారం, మౌలిక వసతులపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. కోటలోని ఎక్సలెన్స్ సెంటర్‌పై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేయాలని సూచించారు. ట్రాన్స్‌జెండర్ల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, వారి కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి అవసరమైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు.



# టీసీఎస్‌లో ఉద్యోగాలకు వాక్-ఇన్ డ్రైవ్

## 2025, 2026 బ్యాచ్ గ్రాడ్యుయేట్లకు అవకాశం

## బ్యాక్ ఆఫీస్ ఆపరేషన్స్-డేటా ప్రాసెసింగ్ ఉద్యోగాలు

## అక్టోబర్ 7న తిరుపతిలో వాక్-ఇన్

## ఫ్రెషర్స్ కూడా దరఖాస్తు చేసుకోవచ్చు




తిరుపతి, అక్టోబర్ 4: (మహి న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), తిరుపతి జిల్లా ఆధ్వర్యంలో ప్రముఖ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)లో బ్యాక్ ఆఫీస్ ఆపరేషన్స్--డేటా ప్రాసెసింగ్ ఉద్యోగాల కోసం వాక్-ఇన్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్. లోకనాథం తెలిపారు. బీకాం, బీఏ, బీబీఏ, బీబీఎం, బీఎంఎస్, బీఏఎఫ్, బీబీఐ, బీఎస్సీ విద్యార్హతలు కలిగిన 2025, 2026 బ్యాచ్ గ్రాడ్యుయేట్లు అర్హులు. కంప్యూటర్ సైన్స్, ఐటీ విభాగాల బీఎస్సీ అభ్యర్థులు అర్హులు కారు. ఫ్రెషర్స్ కూడా పాల్గొనవచ్చని తెలిపారు. ఏ షిఫ్ట్‌లోనైనా పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలి.

వాక్-ఇన్ వివరాలు

తేదీ: అక్టోబర్ 7, 2026

సమయం: ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు

వేదిక: అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, తిరుపతి.

అభ్యర్థులు రెజ్యూమ్, విద్యార్హతల ఒరిజినల్ ధ్రువపత్రాలు, స్కాన్ కాపీలు, ప్రభుత్వ గుర్తింపు కార్డును వెంట తీసుకురావాలి. టీసీఎస్ నెక్స్ట్‌స్టెప్ పోర్టల్‌లో బీపీఎస్ కేటగిరీ కింద, అలాగే ఏపీ నైపుణ్యం పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని అధికారులు తెలిపారు. మరిన్ని వివరాలకు 90527 17078 నంబర్‌ను సంప్రదించాలని, అర్హత కలిగిన యువత ఈ ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కోరారు.

# ఆయిల్‌పామ్ రైతులతో కేంద్ర సహాయ మంత్రి ముఖాముఖి

## తోటలను పరిశీలించి సాగు, దిగుబడులు, ఆదాయంపై ఆరా

## అంతర పంటలతో అదనపు ఆదాయం పొందాలని ఉద్యానశాఖ సూచన

## రైతుల సమస్యలు, సూచనలు, సాగు అనుభవాలపై చర్చ





శ్రీకాళహస్తి, అక్టోబర్ 4: (మహి న్యూస్): శ్రీకాళహస్తి మండలం వేదం గ్రామంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ ఆయిల్‌పామ్ తోటలను సందర్శించి రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల సాగు అనుభవాలు, దిగుబడులు, ఆదాయం, సమస్యలు, సూచనలను అడిగి తెలుసుకున్నారు. రైతు బాలారెడ్డి సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటను పరిశీలించిన మంత్రి, ఆయన సాధిస్తున్న దిగుబడులు, పొందుతున్న ఆదాయంపై వివరాలు తెలుసుకున్నారు. ఆయిల్‌పామ్ సాగులో రైతులకు అందుతున్న సాంకేతిక సహకారంపై సంస్థల ప్రతినిధులతో చర్చించారు. ఉద్యానశాఖ కమిషనర్ డా. ప్రభాత్ కుమార్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటలను సాగు చేయడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను పాటిస్తూ అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఉద్యానశాఖ అదనపు సంచాలకులు ఎం.కె.వి. శ్రీనివాసులు ఆయిల్‌పామ్ సాగు ప్రయోజనాలను వివరించారు. అనంతరం ఉద్యానశాఖ, ఆయిల్‌పామ్, సంబంధిత పథకాల స్టాళ్లను మంత్రి, అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, ఆర్డీఓ భానుప్రకాష్, జిల్లా ఉద్యాన అధికారి జయభరత్ రెడ్డి, ఆయిల్‌పామ్ అధికారులు, రైతులు, గోద్రేజ్ ఆగ్రోవెట్, ఎఫ్ఎఫ్ఎఫ్ ఆయిల్‌పామ్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.





# నేర ప్రవృత్తికి స్వస్తి పలకండి..
# చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి

### రౌడీ షీటర్లు, నేరచరిత్ర కలిగిన వారికి కౌన్సిలింగ్
### సత్ప్రవర్తనతో జీవించాలని పోలీసుల సూచన
### నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక





కర్నూలు, అక్టోబర్ 4: (మహి న్యూస్): కర్నూలు జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీ షీటర్లు, నేరచరిత్ర కలిగినవారు, చెడు నడత కలిగిన వ్యక్తులకు పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నేర ప్రవృత్తికి స్వస్తి పలికి సత్ప్రవర్తనతో జీవించాలని పోలీసులు సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. భవిష్యత్తులో ఎలాంటి నేరాలకు పాల్పడినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని పోలీసులు తెలిపారు.

# రూ.1.50 కోట్లతో నారావారి షాదీఖానా ప్రారంభం

### హుస్సేనాపురంలో షాదీఖానాను ప్రారంభించిన ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి
### మైనార్టీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది
### ఓర్వకల్లు, నన్నూరులో షాదీఖానాల నిర్మాణానికి ప్రతిపాదనలు





ఓర్వకల్లు, అక్టోబర్ 4: (మహి న్యూస్): ఓర్వకల్లు మండలం హుస్సేనాపురం గ్రామంలో రూ. 1.50 కోట్లతో నిర్మించిన నారావారి షాదీఖానాను పాణ్యం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరితారెడ్డి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఓర్వకల్లు, నన్నూరు గ్రామాల్లో షాదీఖానాల నిర్మాణానికి ఎస్టిమేట్లు పంపించి, నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హుస్సేనాపురం గ్రామంలోని మసీదు నిర్మాణం, పునర్నిర్మాణానికి కూడా ఎస్టిమేట్ పంపించాలని సూచించినట్లు చెప్పారు. షాదీఖానాను అన్ని వర్గాల ప్రజలు వివాహాలు, శుభకార్యాలకు వినియోగించుకునేలా ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, టీడీపీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సోమవారం ప్రజల సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్

### కర్నూలు కలెక్టరేట్‌తో పాటు రెవెన్యూ డివిజన్, మండల కార్యాలయాల్లో నిర్వహణ
### క్యూఆర్ కోడ్ ద్వారా పీజీఆర్ఎస్‌పై ఫీడ్‌బ్యాక్ నమోదు చేసుకునే అవకాశం
### ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలి




కర్నూలు, అక్టోబర్ 4: (మహి న్యూస్): ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని సత్వర పరిష్కారం చూపే ఉద్దేశంతో ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంతో పాటు రెవెన్యూ డివిజన్, మండల కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

#### క్యూఆర్ కోడ్ ద్వారా ఫీడ్‌బ్యాక్

పీజీఆర్ఎస్ ద్వారా అందుతున్న సేవలు, తమ సమస్యల పరిష్కారంపై ప్రజలు తమ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే సౌకర్యాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని కలెక్టర్ తెలిపారు. మొబైల్ ఫోన్‌తో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన అనంతరం తెరుచుకునే పీజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ పేజీలో అవసరమైన వివరాలను నమోదు చేసి తమ అభిప్రాయాలను సమర్పించవచ్చని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్ ఆధారంగా పీజీఆర్ఎస్ సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌లో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందించి, వాటి పరిష్కారంపై తమ స్పందనను క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేయాలని కలెక్టర్ డా. ఏ.సిరి కోరారు.

# శెనగ విత్తనాల పంపిణీపై వ్యవసాయ శాఖ వివరణ

### సర్వర్ సాంకేతిక సమస్యతో కొంతసేపు ఆలస్యం
### ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో మాన్యువల్‌గా విత్తనాల పంపిణీ
### ఒక్కరోజులో 130 క్వింటాళ్ల శెనగ విత్తనాల పంపిణీ
### రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయ శాఖ వెల్లడి

ఓర్వకల్లు, అక్టోబర్ 4: (మహి న్యూస్): ఓర్వకల్లు మండలం హుస్సైనాపురం రైతు సేవా కేంద్రం వద్ద శెనగ విత్తనాల పంపిణీ సందర్భంగా సర్వర్‌లో సాంకేతిక సమస్య ఏర్పడటంతో రైతులు కొంతసేపు వేచి ఉండాల్సి వచ్చిందని మండల వ్యవసాయ అధికారి తెలిపారు. అయితే రైతులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి విత్తనాలను మాన్యువల్‌గా నమోదు చేసి పంపిణీ చేసినట్లు వివరించారు. హుస్సైనాపురం ఆర్ఎస్‌కేలో ఒక్కరోజే 130 క్వింటాళ్ల శెనగ విత్తనాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. విత్తనాలు పొందిన రైతులు సంతృప్తి వ్యక్తం చేశారని పేర్కొన్నారు. రబీ సీజన్‌కు ఓర్వకల్లు మండలానికి మొత్తం 1,400 క్వింటాళ్ల శెనగ విత్తనాలు కేటాయించగా, ఇప్పటివరకు వివిధ రైతు సేవా కేంద్రాల ద్వారా 1,150 క్వింటాళ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలిన విత్తనాలు కూడా అందుతున్నాయని, వాటిని సోమవారం మధ్యాహ్నానికే రైతులకు పంపిణీ పూర్తి చేసేలా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. విత్తనాల పంపిణీకి సంబంధించిన సర్వర్ సమస్య కూడా ప్రస్తుతం పరిష్కరించబడిందని, రైతులకు ఎలాంటి ఆటంకం లేకుండా అన్ని ఆర్ఎస్‌కేలలో సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. రైతులకు అవసరమైన శెనగ విత్తనాలను సకాలంలో అందించేందుకు వ్యవసాయ శాఖ అన్ని చర్యలు తీసుకుంటోందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయ అధికారి స్పష్టం చేశారు.

# నేడు జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారమే లక్ష్యం
### ఉదయం 10 గంటల నుంచి వినతుల స్వీకరణ
### ఆన్‌లైన్‌లోనూ సమస్యలను నమోదు చేసుకునే అవకాశం



నంద్యాల, అక్టోబర్ 4: (మహి న్యూస్): జిల్లా ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించేందుకు సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌తో పాటు రెవెన్యూ డివిజన్, మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు ప్రజల నుంచి అందే వినతులను పరిశీలించి నిబంధనల మేరకు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలను మీకోసం వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకోవచ్చని, అర్జీల పరిష్కార స్థితిని 1100 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా తెలుసుకోవచ్చని వివరించారు. ముందుగా మండల, రెవెన్యూ డివిజన్ లేదా మున్సిపల్ స్థాయిలో సమస్యలను పరిష్కరించుకోవాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలను జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌లో సమర్పించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరించాలని ఆదేశించినట్లు తెలిపారు.

# అర్జీ పరిష్కారంపై ప్రజల అభిప్రాయమే ప్రామాణికం

### క్యూఆర్ కోడ్ ద్వారా ఫీడ్‌బ్యాక్ నమోదు తప్పనిసరి
### అసంతృప్తి వ్యక్తమైన అర్జీలపై ప్రత్యేక పునఃపరిశీలన
### అధికారుల జవాబుదారీతనానికి ఫీడ్‌బ్యాక్ కీలకం



నంద్యాల, అక్టోబర్ 4: (మహి న్యూస్): ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ ఆధారిత ఫీడ్‌బ్యాక్ విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా సమర్పించిన అర్జీలపై అధికారులు తీసుకున్న చర్యల పట్ల అర్జీదారులు ఎంతవరకు సంతృప్తిగా ఉన్నారో నేరుగా తెలుసుకునేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని తెలిపారు.

#### క్యూఆర్ కోడ్ ద్వారా ఫీడ్‌బ్యాక్

అర్జీ పరిష్కారమైనట్లు సమాచారం అందిన అనంతరం సంబంధిత రసీదు లేదా సందేశంలో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్మార్ట్‌ఫోన్‌తో స్కాన్ చేసి, సమస్య పరిష్కారంపై తమ సంతృప్తి లేదా అసంతృప్తిని అర్జీదారులు నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్ ఆధారంగా సమస్యల పరిష్కార నాణ్యతను అంచనా వేసేందుకు, అధికారుల పనితీరును మెరుగుపరిచేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

#### అసంతృప్తి వ్యక్తమైన అర్జీలపై ప్రత్యేక దృష్టి

అధికారులు అందించిన పరిష్కారంపై అర్జీదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తే సంబంధిత అర్జీలను ఉన్నతాధికారులు ప్రత్యేకంగా సమీక్షిస్తారని కలెక్టర్ తెలిపారు. అవసరమైన సందర్భాల్లో క్షేత్రస్థాయిలో సమస్యను పునఃపరిశీలించి అర్జీదారులకు తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యాన్ని గుర్తించడంతో పాటు ప్రభుత్వ సేవల నాణ్యతను మెరుగుపరిచేందుకు ప్రజల ఫీడ్‌బ్యాక్ కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని అర్జీదారులు తమ సమస్య పరిష్కారమైన అనంతరం క్యూఆర్ కోడ్ ద్వారా తప్పనిసరిగా వాస్తవ అభిప్రాయాన్ని నమోదు చేసి పారదర్శక పాలనకు సహకరించాలని కోరారు.




# నేడు నగరపాలక సంస్థలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

### ఉదయం 10 గంటలకు అర్జీల స్వీకరణ
### అన్ని విభాగాల అధికారులు అందుబాటులో
### ఫోన్, వాట్సాప్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ



కర్నూలు, అక్టోబర్ 4: (మహి న్యూస్): కర్నూలు నగరపాలక సంస్థలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎస్‌బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. నగరంలోని రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుధ్యం, మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలపై ప్రజలు లిఖితపూర్వకంగా అర్జీలు సమర్పించవచ్చన్నారు. అన్ని విభాగాల అధికారులు కార్యక్రమానికి హాజరై ఫిర్యాదులను స్వీకరించనున్నారు. కార్యక్రమానికి హాజరు కాలేని పౌరులు 7422992299 నంబర్‌కు ఫోన్ చేయడం లేదా వాట్సాప్ ద్వారా తమ ఫిర్యాదులను తెలియజేయవచ్చని కమిషనర్ తెలిపారు.



నంద్యాల జిల్లా/బనగానపల్లె, మహి న్యూస్ అక్టోబర్ 04: మాదిగల హక్కుల సాధన, ఎస్సీ వర్గీకరణ, సామాజిక న్యాయం, చర్మకారులు, డప్పు కళాకారుల సంక్షేమం కోసం ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అక్టోబర్ 12న బనగానపల్లె హైస్కూల్ మైదానంలో నిర్వహించనున్న 13వ వార్షికోత్సవ దండోరా మహా ప్రస్థానం బహిరంగ సభ కరపత్రాలను ఆదివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద విడుదల చేశారు. ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు, చర్మకారులు, డప్పు కళాకారుల పింఛన్ల కోసం పోరాడుతున్న దండు వీరయ్య మాదిగ, జిల్లా ఉపాధ్యక్షులు పూలరాజు మాదిగ ఆధ్వర్యంలో కరపత్రాల విడుదల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాదిగల హక్కుల సాధన, ఎస్సీ వర్గీకరణ, దళితులపై దాడుల నివారణ, అసైన్డ్ భూముల పరిరక్షణ, చర్మకారులు, డప్పు కళాకారులకు పింఛన్లు, అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం కోసం ఏపీ ఎమ్మార్పీఎస్ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. అక్టోబర్ 12న ఉదయం 11 గంటలకు జరిగే మహాసభకు రాష్ట్రవ్యాప్తంగా మాదిగలు, విద్యార్థులు, మహిళలు, చర్మకారులు, డప్పు కళాకారులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. “మాదిగలారా.. తరలిరండి.. మన హక్కుల కోసం కదలిరండి” అంటూ నాయకులు పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం, ప్రతి మండలం నుంచి యువత, విద్యార్థులు, మహిళలు ఐక్యంగా తరలివచ్చి బనగానపల్లె వేదికగా మాదిగల ఐక్యత, ఆత్మగౌరవాన్ని చాటాలని కోరారు. 13వ వార్షికోత్సవ మహాసభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో లక్ష్మన్న, కిట్టు, సాదేవుడు, ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు, డొక్కల సంఘం అధ్యక్షులు సవారి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నకిలీ ఐపీఓలు.. షేర్ మార్కెట్ పేరుతో సైబర్ మోసాలు

### అధిక లాభాల ఆశ చూపి మోసగాళ్ల వలలోకి లాగుతున్న సైబర్ నేరగాళ్లు
### గుర్తుతెలియని వ్యక్తులు, లింకులు, గ్రూపుల ద్వారా పెట్టుబడులు పెట్టొద్దు
### మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి: ఎస్పీ విక్రాంత్ పాటిల్




కర్నూలు, అక్టోబర్ 5: (మహి న్యూస్): ఆన్‌లైన్ సైబర్ మోసాలు రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. ముఖ్యంగా స్టాక్ మార్కెట్ పెట్టుబడులు, షేర్లు, నకిలీ ఐపీఓల పేరుతో జరుగుతున్న మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంపెనీల ఐపీఓల్లో షేర్లు కేటాయిస్తామని, తక్కువ సమయంలో భారీ లాభాలు వస్తాయని నమ్మిస్తూ సైబర్ నేరగాళ్లు ఫోన్ కాల్స్, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలను సంప్రదిస్తున్నారని తెలిపారు. షేర్ల కొనుగోలు పేరుతో ముందస్తుగా డబ్బులు గుర్తుతెలియని ఖాతాల్లో జమ చేయించుకుని, అనంతరం అందుబాటులో లేకుండా పోతున్నారని వివరించారు.

#### ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

అధీకృత సెబీ గుర్తింపు పొందిన బ్రోకర్లు లేదా అధికారిక బ్యాంకింగ్ మార్గాల ద్వారానే పెట్టుబడులు పెట్టాలని ఎస్పీ సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు, లింకులు, వాట్సాప్ గ్రూపుల ద్వారా వచ్చే పెట్టుబడి ప్రతిపాదనలను నమ్మవద్దన్నారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకుండా, తెలియని యాప్‌లను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేయకుండా జాగ్రత్త వహించాలన్నారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, లేదా సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. త్వరగా ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును తిరిగి పొందే అవకాశం ఎక్కువగా ఉంటుందని ఎస్పీ తెలిపారు.

# రహదారులపై గుంతలు తవ్వితే కఠిన చర్యలు

### శుభకార్యాల్లో కాంక్రీట్ స్టాండ్లనే వినియోగించాలి
### రోడ్లకు నష్టం కలిగిస్తే జరిమానాలు
### నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు హెచ్చరిక

కర్నూలు, అక్టోబర్ 4: (మహి న్యూస్): కర్నూలు నగరంలో వివాహాలు, నిశ్చితార్థాలు, గృహప్రవేశాలు, ఇతర శుభకార్యాల సందర్భంగా షామియానాలు, పందిళ్లు ఏర్పాటు చేసేటప్పుడు రహదారులకు నష్టం కలగకుండా కాంక్రీట్ స్టాండ్లను మాత్రమే వినియోగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. రహదారులపై గుంతలు తవ్వడం, మేకులు కొట్టడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజా అవసరాల కోసం నిర్మించిన రహదారులను శుభకార్యాలు, ఇతర కార్యక్రమాల పేరుతో దెబ్బతీయడం సరికాదన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్స్ చట్టం--1994 ప్రకారం జరిమానాలు విధిస్తామని తెలిపారు. రహదారులకు నష్టం కలిగించే కార్యక్రమాలను అడ్డుకునేందుకు నగరంలో క్షేత్రస్థాయిలో నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ స్పష్టం చేశారు.

# లోకకల్యాణంకోసం శ్రీ స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవం



శ్రీశైలం, మహి న్యూస్, అక్టోబర్ 4 : లోకకల్యాణంకోసం దేవస్థానం ఆదివారం రాత్రి శ్రీ స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవం నిర్వహిస్తుంది. ఈ పల్లకీ ఉత్సవం ప్రతి ఆదివారం, పౌర్ణమి మరియు మూలా నక్షత్రం రోజులలో దేవస్థాన సేవగా (సర్కారి సేవగా) జరిపించబడుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా అమ్మవారి ఆలయ ఆశీర్వచన మండపంలో లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవాసంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించబడుతుంది. అనంతరం శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో వేంచేబు చేయించి శాస్త్రోక్తంగా షోడశోపచారపూజలు జరిపించబడ్డాయి.

# బుర్రిపాలెంలో సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు కలెక్టర్ స్వాగతం



### 3డీ టెక్నాలజీతో గృహ నిర్మాణానికి శంకుస్థాపన
### కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి



గుంటూరు, అక్టోబర్ 4: (మహి న్యూస్): తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామంలో 3డీ టెక్నాలజీతో గృహ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ సాదర స్వాగతం పలికారు.

# శ్రీశైలం, తిరుమల భక్తులతో సోమనాథ్‌కు ప్రత్యేక రైలు..

**అమరావతి,:** ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ నుంచి గుజరాత్‌లోని సోమనాథ్ క్షేత్రానికి ‘సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్’ ప్రత్యేక రైలు యాత్ర ఘనంగా ప్రారంభమైంది. భారతదేశ సాంస్కృతిక వారసత్వానికి, విశ్వాసానికి ప్రతీక అయిన శ్రీ సోమనాథ్ దేవాలయంపై దాడి జరిగి వెయ్యేళ్లు, ఆలయ పునర్నిర్మాణం జరిగి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఈ వేడుకలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఏపీ ప్రభుత్వం, దేవాదాయ, భాషా-సాంస్కృతిక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ రైల్వే స్టేషన్ నుంచి 18 బోగీలతో కూడిన ప్రత్యేక ఎఫ్‌టీఆర్ రైలును వేరావల్‌కు పంపించారు. ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, దేవాదాయ శాఖ కమిషనర్ కే. రామచంద్ర మోహన్ ఈ యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 21 ప్రముఖ దేవాలయాల నుంచి ఎంపిక చేసిన 1,060 మంది భక్తులు ఈ యాత్రలో ఉచితంగా పాల్గొంటున్నారు. శ్రీశైలం, తిరుమల, ఇంద్రకీలాద్రి, సింహాచలం, అన్నవరం, కాణిపాకం, శ్రీకాళహస్తి వంటి వివిధ ప్రముఖ పుణ్యక్షేత్రాల నుంచి భక్తులు ఈ ప్రత్యేక రైలు ద్వారా తరలివెళ్లారు. వీరితో పాటు రాష్ట్ర సంస్కృతి, కళారూపాలను ప్రదర్శించేందుకు 100 మందితో కూడిన సాంస్కృతిక బృందం కూడా ఈ యాత్రలో పాలుపంచుకుంటోంది. భక్తుల సౌకర్యం కోసం రైలులో భోజనం, వసతి, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించారు. ప్రతి బోగీకి ప్రత్యేక పర్యవేక్షకులను, ప్రతి 22 మంది భక్తులకు ఒక గ్రూప్ లీడర్‌ను నియమించారు. గుజరాత్‌లో రెండు రోజుల పాటు భక్తులకు స్థానిక రవాణా, వసతి, ప్రసిద్ధ క్షేత్రాల దర్శన ఏర్పాట్లను అక్కడి ప్రభుత్వం సమకూరుస్తోంది. జాతి సమగ్రతను, సాంస్కృతిక వైభవాన్ని చాటే ఈ చారిత్రక యాత్రలో పాల్గొనడం అదృష్టమని భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దేవాదాయ, సాంస్కృతిక, రైల్వే శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది.

## గాలివీడు రామాలయ ధ్వజస్తంభంపై పిడుగు



గాలివీడు:అక్టోబర్04(మహి న్యూస్ ): మండలకేంద్రంలోని స్థానిక గేటు వద్ద ఉన్న శ్రీరామాలయ ధ్వజస్తంభంపై ఆదివారం పిడుగు పడింది. పిడుగు ప్రభావంతో ధ్వజస్తంభం దిమ్మె పాక్షికంగా దెబ్బతిన్నది. పిడుగుపాటుతో పెద్ద శబ్దం రావడంతో ఆలయ పరిసరాల్లో ఉన్న భక్తులు, స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.ధ్వజస్తంభం దెబ్బతినడంతో భక్తులు ఆందోళనకు గురైనప్పటికీ ఆలయానికి, భక్తులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.ధ్వజస్తంభాన్ని అధికారులు పరిశీలించి, దెబ్బతిన్న భాగానికి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

## చిన్నారి భవనీత్‌కు బాసటగా....

### మేము సైతం అంటూ విరాళాల వెల్లువ..

### ఇప్పటివరకు రూ.5.50 లక్షల ఆర్థిక సాయం.



గాలివీడు:అక్టోబర్ 04(మహి న్యూస్): మానవత్వం వెల్లువిరిసిన వేళ ప్రాణాంతక వ్యాధితో మృత్యువుతో పోరాడుతున్న రెండున్నరేళ్ల చిన్నారి భవనీత్‌కు దాతలు అండగా నిలుస్తున్నారు. చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం అందించాలంటూ ప్రచురితమైన కథనాలకు స్పందించిన పలువురు దాతలు, వివిధ వర్గాల ప్రజలు ముందుకు రావడంతో ఇప్పటివరకు రూ.5.50 లక్షల ఆర్థిక సాయం అందినట్లు చిన్నారి తల్లిదండ్రులు తెలిపారు. ఇందులో బ్యాంకు ఖాతా ద్వారా రూ.1.80 లక్షలు, నగదు రూపంలో రూ.3.70 లక్షలు అందినట్లు వారు వెల్లడించారు.అప్లాస్టిక్ అనీమియా అనే ప్రాణాంతక వ్యాధితో భవనీత్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలిసిందే. చిన్నారి వైద్య చికిత్సకు సుమారు రూ.30 లక్షల వరకు అవసరం కావడంతో తల్లిదండ్రులు వీరబల్లి వెంకటరమణ, శ్రీదేవి తమ బిడ్డను కాపాడేందుకు దాతల సహాయం కోసం కన్నీటి పర్యంతమవుతూ వేడుకుంటున్నారు. చిన్నారి పరిస్థితిపై వార్తా పత్రికలు, సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరగడంతో విషయం ఊరూ వాడా చేరింది. దీంతో వందలు, వేల రూపాయలుగా ప్రారంభమైన సాయం క్రమంగా లక్షల రూపాయలకు చేరుకుంది. పల్లెలు, గ్రామాలు, వివిధ యూనియన్లు, వ్యాపారులు, పాఠశాలలు, కార్యాలయాల సిబ్బంది, మహిళలు, చిన్నారులు ఇలా అన్ని వర్గాల ప్రజలు తమకు తోచినంత సాయం చేస్తూ భవనీత్ కుటుంబానికి అండగా నిలుస్తున్నారు. తమ బిడ్డ పట్ల మానవత్వంతో స్పందించి ఆర్థిక సహాయం అందిస్తున్న ప్రతి ఒక్కరికీ చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటివరకు రూ.5.50 లక్షల సాయం అందినప్పటికీ వైద్యానికి ఇంకా భారీ మొత్తంలో నిధులు అవసరం కావడంతో మరింత సహాయం కోసం కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారు. మానవతావాదులు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి చిన్నారి వైద్యానికి అవసరమైన నిధులు సమకూర్చేలా సహకరించాలని కుటుంబ సభ్యులు చేతులు జోడించి వేడుకుంటున్నారు. సహాయం చేయదలచిన వారు ఫోన్ పే: 7997510574 ద్వారా ఆర్థిక సాయం చేయాలని కోరారు.



## అపర భగీరథుడు మంత్రి రాంప్రసాద్ రెడ్డి : సుధాకర్



రాయచోటి, మహిన్యూస్, అక్టోబర్ 04 : రాయచోటి లోని చెన్న ముక్క పల్లె గ్రామపంచాయతీ నందు టిడిపి మండల అధ్యక్షులు గండికోట సుధాకర్ విలేకరులతో మాట్లాడుతూ రాయచోటి అపర భగీరథుడు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అని అన్నారు. నియోజకవర్గంలో ఎక్కడైనా త్రాగునీటి సమస్య ఉందంటే నేనున్నానంటూ ముందు నిలబడి పరిష్కారం చూపిస్తున్నారని, నిత్యం ప్రజలతో ప్రజల మధ్యే ఉంటూ వారి కష్టసుఖాలను ప్రత్యక్షంగా తెలుసుకునే ప్రజా నాయకుడే మంత్రి రాంప్రసాద్ రెడ్డి అని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి వర్గానికి చేరువై, వారి సమస్యలకు తక్షణ పరిష్కారం చూపేందుకు అనుక్షణం శ్రమిస్తున్నారని, ఇందులో భాగంగానే ఈరోజు చెన్నముక్కపల్లి గ్రామపంచాయతీలో రెండు త్రాగునీటి బోర్లను వేయించడం జరిగింది, బోర్లలో కూడా సుమారు 2 రెండు ఇంచుల పై మాటే నీళ్లు రావడం జరిగిందని, ప్రజలందరూ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలుపుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## దసరా ప్రత్యక్ష విశేష పూజా టికెట్ల విడుదల

### చైర్మన్ బొర్రా రాధాకృష్ణ,ఈవో వి.కె. శీనా నాయక్ వెల్లడి





ఇంద్రకీలాద్రి, మహి న్యూస్, అక్టోబర్ 4: శ్రీ పరాభవ నామ సంవత్సర దసరా శరన్నవరాత్రి మహోత్సవాల (తేది: 11.10.2026 నుండి 20.10.2026 వరకు) సందర్భంగా ఇంద్రకీలాద్రిపై నిర్వహించే విశేష ప్రత్యక్ష పూజా సేవల టికెట్లను అక్టోబర్ 5వ తేదీ సాయంత్రం విడుదల చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ ),కార్యనిర్వహణాధికారి వి.కె. శీనానాయక్ ఒక ప్రకటన లో తెలిపారు.

**దసరా నవరాత్రులలో జగన్మాత శ్రీ కనకదుర్గ అమ్మవారి సన్నిధిలో జరిగే అత్యంత విశేషార్చిత సేవలైన**

**ప్రత్యేక కుంకుమార్చన ,**

**ప్రత్యేక చండీ హోమము,**

**ప్రత్యేక దేవీ ఖడ్గమాలార్చన ,**

**ప్రత్యేక శ్రీచక్ర నవావరణార్చన**

పూజలలో భక్తులు స్వయంగా పాల్గొనేందుకు గానూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారిక 'మన మిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ (9552300009) ద్వారా నిర్ణీత సంఖ్యలో టికెట్లను అక్టోబర్ 5 సాయంత్రం అందుబాటులో ఉంచుతున్నామని పేర్కొన్నారు. భక్తులు ఈ వాట్సాప్ సేవను వినియోగించుకుని తమ టికెట్లను ముందస్తుగా సులభంగా బుక్ చేసుకోవచ్చని సూచించారు. అమ్మవారి జన్మనక్షత్రమైన అత్యంత కీలకమైన 'మూలా నక్షత్రం' (తేది: 16.10.2026) రోజున లక్షలాదిగా తరలివచ్చే సామాన్య భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఆ ఒక్క రోజు అన్ని ప్రత్యేక పూజలను 'సర్కార్ సేవ'గా దేవస్థానమే స్వయంగా శాస్త్రోక్తంగా, వైభవంగా జరిపిస్తుందని చైర్మన్,ఈవో స్పష్టం చేశారు. ఆ రోజున భక్తులు పరోక్ష పూజలను బుక్ చేసుకుని, ఇంటి వద్ద నుండే పూజలో ఆన్ లైన్ ద్వారా పాల్గొనవచ్చుని, పూజా ప్రసాదాలు భక్తుల చిరునామాకు పోస్ట్ ద్వారా పంపబడతాయని తెలిపారు. అక్టోబర్ 11వ తేదీ నుండి 20వ తేదీ వరకు (అక్టోబర్ 16 మినహాయించి) మిగిలిన అన్ని రోజులలో భక్తులు ఇంద్రకీలాద్రిపై ప్రత్యక్షంగా ఈ ప్రత్యేక పూజలలో పాల్గొనవచ్చుని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈవో కోరారు. విజయవాడ కుమ్మరి పాలెం సెంటర్ టీటీడీ స్థలం నుండి వాహనాల ద్వారా పూజా టికెట్స్ బుక్ చేసుకున్న వారిని కొండపైకి చేరుస్తామని పేర్కొన్నారు.

## ప్రతి ఇంటికీ స్వచ్ఛ జలం..!

### ప్రొద్దుటూరు నుంచి జల విప్లవానికి శ్రీకారం

### రూ.30,156 కోట్లతో 'జల జీవన్ మిషన్ - అమరజీవి జలధార'కు రాష్ట్ర స్థాయి ప్రారంభోత్సవం

### 27.36 లక్షల కొత్త కుళాయి కనెక్షన్లతో.. 3.27 కోట్ల గ్రామీణ ప్రజలకు చేకూరనున్న ప్రయోజనం

### రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా సోమవారం లాంఛనిక ప్రారంభం

కడప, మహి న్యూస్ అక్టోబర్ 04: గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో భారీ ముందడుగు వేస్తోంది. కోట్లాది మంది గ్రామీణ ప్రజల తాగునీటి అవసరాలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో చేపట్టిన 'జల జీవన్ మిషన్ - అమరజీవి జలధార' కార్యక్రమానికి వైఎస్ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరు వేదికగా సోమవారం రాష్ట్ర స్థాయిలో శ్రీకారం చుట్టనున్నారు. ఈ బృహత్తర కార్యక్రమాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథులుగా హాజరై పైలాన్‌ను ఆవిష్కరించి పనులకు శంఖుస్థాపన చేయనున్నారు.

### ఇది కేవలం తాగునీటి పథకం మాత్రమే కాదు..

గ్రామీణ కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే భారీ మౌలిక వసతుల నిర్మాణ కార్యక్రమం. రూ.30,156.12 కోట్ల అంచనా వ్యయంతో 50,315 పనులు చేపట్టడం ద్వారా రాష్ట్రంలోని మారుమూల గ్రామాలకు సైతం శాశ్వత నీటి వసతులను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం.

### ప్రతి ఇంటికీ కుళాయి..

### ప్రతి కుటుంబానికీ సురక్షిత నీరు..

'హర్ ఘర్ జల్' లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జల జీవన్ మిషన్‌ను 2028 డిసెంబర్ వరకు పొడిగించింది. ప్రతి గ్రామీణ కుటుంబానికి వ్యక్తిగత కుళాయి కనెక్షన్ ద్వారా తలసరి రోజుకు 55 లీటర్ల సురక్షిత మంచినీరు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. రాష్ట్రంలో ఇప్పటికే 61.60 లక్షల కుటుంబాలకు, అంటే సుమారు 65 శాతం కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు అందాయి. మిగిలిన కుటుంబాలను కూడా వేగంగా కవరేజ్‌లోకి తీసుకురావడానికి ప్రభుత్వం భారీగా పనులు చేపడుతోంది. 'అమరజీవి జలధార'లో భాగంగా 24,601 ఆవాసాల్లోని 27.36 లక్షల కుటుంబాలకు కొత్తగా కుళాయి కనెక్షన్లు అందించనున్నారు. తద్వారా సుమారు 3.27 కోట్ల గ్రామీణ ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరనుంది.

### రూ.30 వేల కోట్లకు పైగా పెట్టుబడి...

"జల జీవన్ మిషన్--అమరజీవి జలధార" కింద చేపట్టే పనులకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. ఎస్‌వీఎస్,



పునరుద్ధరణ పనులకు రూ.9,068.94 కోట్లు, 32 ఎంవీఎస్ ప్రాజెక్టులకు రూ.19,462.39 కోట్లు, నీటి నాణ్యత పర్యవేక్షణ తదితర కార్యకలాపాలకు రూ.1,624.79 కోట్లు కలిపి మొత్తం రూ.30,156.12 కోట్ల పెట్టుబడితో 50,315 పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే 27,301 పనులు పూర్తికాగా, రూ.5,587.01 కోట్లు ఖర్చు చేశారు. మిగిలిన పనులను కూడా వేగంగా పూర్తి చేసి గ్రామీణ ప్రజలకు సుస్థిరమైన నీటి సరఫరా అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయి.

### ప్రధాన జలాశయాల నుంచి గ్రామాలకు నీరు...

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ ఎంవీఎస్ ప్రాజెక్టులను చేపడుతున్నారు. హిరమండలం, పీఏబీఆర్, వెలుగోడు--ఓంకారం, ధవళేశ్వరం, తాండవ, ఏలేరు, గండికోట వంటి ప్రధాన జలాశయాలు, నీటి వనరుల నుంచి నీటిని సేకరించి గ్రామీణ ప్రాంతాలకు సరఫరా చేసే విధంగా వ్యవస్థను రూపొందిస్తున్నారు. రూ.10,320 కోట్లతో చేపట్టే 12 కీలక ఎంవీఎస్ ప్రాజెక్టుల ద్వారా 7,126 ఆవాసాల్లోని 88.68 లక్షల జనాభాకు ప్రయోజనం కలగనుంది. మరోవైపు రూ.3,297 కోట్లతో 8,494 ఎస్‌వీఎస్ పనులు చేపట్టనున్నారు.

### వేల కిలోమీటర్ల పైపులైన్లు..

### భారీ నీటి నిల్వ వ్యవస్థ...

అమరజీవి జలధార ద్వారా గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థకు భారీ మౌలిక వసతులు సమకూరనున్నాయి. ఇందులో భాగంగా 1,426 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నీటి శుద్ధి కేంద్రాలు, 14,995 నీటి నిల్వ నిర్మాణాలు, 77,243 కిలోమీటర్ల మేర పైపులైన్లు నిర్మించనున్నారు. ఇవి పూర్తయితే మారుమూల గ్రామాలు, కొండ ప్రాంతాలు, నీటి కొరత ఎదుర్కొనే ప్రాంతాల్లోనూ ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించే సామర్థ్యం రాష్ట్రానికి ఏర్పడుతుంది.

### నీటి భద్రతతో గ్రామీణ జీవనంలో కొత్త మార్పు...

సురక్షిత తాగునీరు అందుబాటులోకి రావడం వల్ల గ్రామీణ కుటుంబాలకు సమయం, శ్రమ ఆదా కావడమే కాకుండా మహిళలు, పిల్లలపై నీటి సేకరణ భారం తగ్గనుంది. నీటి నాణ్యత పర్యవేక్షణ, స్థానిక సమాజ భాగస్వామ్యం, వనరుల సుస్థిర నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా భవిష్యత్ తరాలకు కూడా నీటి భద్రత కల్పించేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు.

### ప్రొద్దుటూరు నుంచి రాష్ట్రానికి కొత్త భరోసా...

రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది గ్రామీణ ప్రజల జీవితాలను ప్రభావితం చేసే ఈ భారీ కార్యక్రమానికి ప్రొద్దుటూరు వేదిక కావడం వైఎస్ఆర్ కడప జిల్లాకు ప్రత్యేక ప్రాధాన్యతను తీసుకొచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా రాష్ట్ర స్థాయిలో కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ద్వారా 'ప్రతి ఇంటికీ నీరు.. ప్రతి కుటుంబానికి భరోసా' అనే ప్రభుత్వ లక్ష్యం మరింత వేగం అందుకోనుంది. ఈ బృహత్తర కార్యక్రమానికి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పలువురు రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, కార్యదర్శులు, ఎమ్మెల్యేలు, కూటమి ప్రభుత్వ నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. దీంతో ప్రొద్దుటూరు ప్రాంతం మొత్తం పండుగ వాతావరణాన్ని సంతరించుకోనుంది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ కుటుంబాలకు సురక్షిత తాగునీటిని అందించే మహత్తర లక్ష్యానికి ప్రొద్దుటూరు వేదికగా శ్రీకారం చుట్టడం ప్రజల్లో కొత్త ఆశలు, అభివృద్ధిపై మరింత నమ్మకాన్ని నింపనుంది. ప్రతి ఇంటికీ కుళాయి.. ప్రతి కుటుంబానికీ స్వచ్ఛమైన నీరు అనే లక్ష్య సాధనలో 'జల జీవన్ మిషన్--అమరజీవి జలధార' రాష్ట్ర అభివృద్ధిలో ఒక కీలక మైలురాయిగా నిలవనుంది.

## సీఎం, డిప్యూటీ సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు...!

### జిల్లా కలెక్టర్, ఎస్పీలతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు

### అమృత్‌నగర్‌లో రెండు హెలీప్యాడ్లు, జలజీవన్ మిషన్-అమరజీవి జలధార లాంచింగ్ పైలాన్ పరిశీలన



కడప జిల్లా/ప్రొద్దుటూరు,మహి న్యూస్ అక్టోబర్ 4 : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రొద్దుటూరు పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టింది. పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు ప్రోటోకాల్‌కు అనుగుణంగా, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత, రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సంయుక్తంగా అధికారులకు సూచించారు. ఆదివారం సాయంత్రం జిల్లా ఇన్‌చార్జి



మంత్రి ఎస్. సవిత, రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్‌లతో కలిసి ప్రొద్దుటూరు అమృత్‌నగర్‌లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి రాక కోసం ఏర్పాటు చేసిన రెండు హెలీప్యాడ్లను పరిశీలించారు. హెలీప్యాడ్ల వద్ద భద్రత, వాహనాల రాకపోకలు, పార్కింగ్, ఇతర అవసరమైన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం జలజీవన్ మిషన్-అమరజీవి జలధార కార్యక్రమ లాంచింగ్ కోసం ఏర్పాటు చేసిన పైలాన్‌ను మంత్రులు, జిల్లా కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించి, అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తదుపరి బహిరంగ సభా ప్రాంగణాన్ని సందర్శించిన



మంత్రులు, జిల్లా కలెక్టర్, ఎస్పీలు భద్రతా ఏర్పాట్లు, వీఐపీ గ్యాలరీలు, సభా వేదిక, ప్రజల గ్యాలరీలు, పార్కింగ్, రాకపోకల మార్గాలు తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్పీతో చర్చించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భద్రతా చర్యలు పకడ్బందీగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, వైద్య సదుపాయాలు, పార్కింగ్, రవాణా తదితర సౌకర్యాలు సమర్థవంతంగా ఏర్పాటు చేయాలని మంత్రులు సూచించారు. కార్యక్రమం విజయవంతంగా జరిగేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యేలు, జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు కూడా మంత్రులు, జిల్లా కలెక్టర్, ఎస్పీల వెంట పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. స్థానికంగా ప్రజలకు అవసరమైన సౌకర్యాలు, సభా ప్రాంగణానికి ప్రజల రాకపోకలకు సంబంధించిన అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పర్యటనకు సంబంధించిన ప్రతి ఏర్పాటును సంబంధిత శాఖలు సమన్వయంతో పర్యవేక్షించాలని, ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన, డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీవోలు, స్థానిక నాయకులు, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్లే లక్ష్యం..

## సామాజిక న్యాయమే మా ప్రభుత్వ విధానం

రాయచోటి, మహి న్యూస్, అక్టోబర్ 4: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. బీసీలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు సామాజిక న్యాయాన్ని సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అన్ని స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో అసెంబ్లీలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుని జీవో నంబర్ 105, 1065 జారీ చేసిందని తెలిపారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ఎన్నికలు జరగకపోయినా, బీసీలకు రిజర్వేషన్ దక్కకూడదనే కుట్రతో గోడ్డలి పార్టీ నేతలు అడ్డుకుంటున్నారని మంత్రి విమర్శించారు. బీసీలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని స్పష్టం చేశారు. న్యాయపరంగా ఉన్న ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకుని బీసీలకు న్యాయం జరిగేలా చూస్తామని, వైసీపీ హయాంలో 34 శాతం రిజర్వేషన్ల కోసం కొట్టేసిన సుప్రీంకోర్టు తీర్పులకు వ్యతిరేకంగా వెళ్లకుండా బీసీలకు చారిత్రాత్మక ద్రోహం చేశారని మంత్రి పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న తమ సంకల్పం మారదని, బీసీలకు న్యాయం జరిగే వరకు కృషి చేస్తామని తెలిపారు. 34 శాతం రిజర్వేషన్లతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని మంత్రి అన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ఇస్తే రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతుందని, కులంతో సంబంధం లేకుండా అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు.



### బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరగాలి

బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా వారి సమస్యలను మరింత సమర్థవంతంగా పరిష్కరించే అవకాశం ఉంటుందని మంత్రి అన్నారు. సమాజంలో వెనుకబడి ఉన్న బీసీల అభ్యున్నతి కోసం తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. హైకోర్టు తీర్పును గౌరవిస్తూ బీసీలకు న్యాయం జరిగేలా సుప్రీంకోర్టులో న్యాయపరమైన పోరాటం కొనసాగిస్తామని మంత్రి తెలిపారు. ఇది కేవలం రిజర్వేషన్ల అంశం మాత్రమే కాదని, బీసీలకు దక్కాల్సిన రాజకీయ ప్రాతినిధ్యానికి సంబంధించిన అంశమని స్పష్టం చేశారు. నాలుగు దశాబ్దాలుగా బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే దిశగా వివిధ ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయని మంత్రి గుర్తు చేశారు. 1987లో బీసీలకు 20 శాతం, 1995లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. బీసీలకు రాజకీయ సాధికారత కల్పించడమే లక్ష్యంగా ఈ విధానం కొనసాగుతోందన్నారు. బీసీలకు న్యాయం జరగాలి.. వారికి దక్కాల్సిన రాజకీయ ప్రాతినిధ్యం దక్కాలి. 34 శాతం రిజర్వేషన్ల అమలు కోసం ప్రభుత్వం రాజ్యాంగబద్ధమైన, న్యాయపరమైన మార్గాల్లో ముందుకు సాగుతుంది అని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPA DIST, A.P
PRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com